నేటి కందం- నేటికి అందం

తెలుగుల నట రంగమ్మును
వెలుగులతో నింప భవుడు వీరేశుండై
యలుపెరుగక సలిపిన కృషి
తలచి తలచి తలచి నేను దండము లిడెదన్

(ఏప్రియల్ 16 తెలుగు నాటక
రంగ దినోత్సవం)

-రాధశ్రీ
సెల్:9494481210

నేటి నిజం
తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

బుల్డోజర్ పరిపాలన
భుజకీర్తులు అక్కడ
ఎనలేని విమర్శలు
ఎందుకొరకు ఇక్కడ
దేశమేలే అధినేతకు
దేశమంతా ఒకటికాదా
మరుగుపరిచి వాస్తవాలు
మాట్లాడితే విలువపోదా

-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ బుధవారం 16-4-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:200 పేజీలు:6 వెల: రూ.1/-

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి- సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్ ఆదేశం

-భూ భారతి మహాద్భుతం
-వందేండ్ల సమస్యకు పరిష్కారం చూపాం
-ప్రజా ప్రభుత్వంలోని పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి
-సన్న బియ్యం పథకం చరిత్రలో నిలిచిపోతుంది
-బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదు
-తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరిబిక్కిరి
-ప్రతి ఎమ్మెల్యే ప్రజలతో మమేకం కావాలి
-రేపటి నుంచి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించాలి
-హెచ్‌సీయూ భూములపై ప్రతిపక్షాల అబద్ధపు ప్రచారం
-ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్ఎస్ విషం చిమ్ముతున్నాయి
-సీఎల్పీ భేటీలో మండిపడ్డ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 15:ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, మనం తీసుకున్న గొప్ప నిర్ణయాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో నేడు జరిగిన సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలకు మన ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందన్నారు. భూ భారతి ఓ మహాద్భుతమని కొనియాడారు. నన్నబియ్యం పథకం ఒక అద్భుతమైందన్నారు. ఆనాడు ?2 కిలో బియ్యంలా ఇప్పుడు సన్నబియ్యం పథకం శాశ్వతంగా గుర్తుండిపోతుందన్నారు. మనం ఎంత మంచి చేసినా.. ప్రజల్లోకి తీసుకెళ్లకపోతే ప్రయోజనం ఉండదని, మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

తెలంగాణ పథకాలతో ప్రధాని ఉక్కిరిబిక్కిరి

నిన్న మొన్నటి దాకా కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి మనపై విమర్శలు చేశారని, ఇప్పుడు ఏకంగా ప్రధాని మోదీనే రంగంలోకి దిగారని విమర్శించారు. తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరి, బిక్కిరి అవుతున్నారన్నారు. వర్గీకరణ మోదీకి గుదిబండగా మారిందన్నారు. కులగణన మోదీకి మరణశాసనం రాయబోతోందని, దేశంలో తెలంగాణ మోడల్ పై చర్చ జరుగుతోందన్నారు. అందుకే తెలంగాణలో కాంగ్రెస్?ను ఇబ్బంది పెట్టాలనే బీజేపీ, బీఆరెస్ ఒక్కటయ్యాయని చెప్పారు. సన్న బియ్యం బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలన్నారు. సన్న బియ్యం మన పథకం.. మన పేటెంట్, మన బ్రాండ్ అని సీఎం స్పష్టం చేశారు.

భూ భారతిని రైతులకు చేరవేయాలి

సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ భూభారతి ని రైతులకు చేరువ అయ్యేలా చూడాలన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. దేశంలోనే ఇందిరమ్మ ఇండ్ల పథకం ఆదర్శంగా నిలిచిందన్నారు. క్షేత్ర స్థాయిలో నిజమైన లబ్ది దారులకు ఇందిరమ్మ ఇండ్లు అందాలన్నారు. దీన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు.

వందేళ్ల సమస్యను శాశ్వతంగా పరిష్కారం

సీఎం మాట్లాడుతూ కులగణన ద్వారా వందేళ్ల సమస్యను శాశ్వతంగా పకడ్బందీగా పరిష్కరించామన్నారు. విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిల్లులు తీసుకొచ్చామని, ఇది మన పారదర్శక పాలనకు నిదర్శనమని అన్నారు. జటిలమైన ఎస్సీ ఉపకులాల వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని, అందుకే వర్గీకరణ జరిగే వరకు ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదని గుర్తు చేశారు.

రేపటి నుంచి ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటించేలా

ప్రతి ఎమ్మెల్యే ప్రజలతో మమేకమవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. రేపటి నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో ప్రతీ గ్రామం పర్యటించేలా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. తాను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకం అవడానికి సమయం కేటాయిస్తానని చెప్పారు. హెచ్ సీ యూ భూములపై ప్రతిపక్షం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో ఒక అబద్ధపు ప్రచారం చేసిందన్నారు. ఈ ప్రచారాన్ని ప్రధాని మోదీ కూడా నమ్మి బుల్డోజర్లు పంపిస్తున్నారని మాట్లాడుతున్నారని, బీజేపీ, బీఆరెస్ కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయన్నారు. పార్టీ, ప్రభుత్వం ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుందన్నారు. విూ నియోజకవర్గంలో ఏం కావాలో ఒక నివేదిక తయారు చేసుకోవాలని, ఆ పనులను పూర్తి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

ఒక్కసారిగా మారిన వాతావరణం - పలు చోట్ల వడగండ్ల వాన

హైదరాబాద్, ఏప్రిల్ 15: వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం నుంచి ఎండ దంచికొట్టగా.. మధ్యాహ్నానికి ఆకాశం చల్లబడింది. నిమిషాల్లోనే వాతావరణం మేఘావృతమైంది. ఈ క్రమంలో పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి, ఖైరతాబాద్, లక్డీకపూల్, సోమాజిగూడ, ఎస్ఆర్ నగర్, అమీర్ పేట్, పంజాగుట్ట, ఎర్రమంజిల్, తార్నాక, నల్లకుంట, విద్యానగర్, ఎల్బీ నగర్, దిల్ సుఖ్ నగర్, కొత్తపేట తదితర ప్రాంతాల్లో ఈదురు గాలులతో, వడగళ్లతో కూడిన వాన పడుతోంది.ఒక్కసారిగా వెదర్ ఛేంజ్ అయ్యి వర్షం కురుస్తుండటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్ల మీదకు రావడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. భారీ వర్షం కురుస్తోన్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ యంత్రాగం అప్రమత్తమైంది. అత్యవసరమైతేనే ఇండ్ల నుంచి బయటకు వెళ్లాలని నగరవాసులకు సూచించింది.

ఆరాధ్యుల, కందిమళ్ల, గుర్రాలలకు కందుకూరి రంగస్థల పురస్కారాలు

– ఒక్కొక్కరికి లక్ష రూపాయల నగదు
– రేపు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కందుకూరి రంగస్థల పురస్కారాల ప్రదానోత్సవం





హైదరాబాద్, ఏప్రిల్ 15: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చలనచిత్ర టివి నాటక రంగ అభివృద్ధి సంస్థ (ఒఖఈఆఅ) ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కందుకూరి వీరేలింగం పంతులు 177వ జయంతి వేడుకలు, తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా నాటక రంగ ప్రముఖులకు, రచయితలకు కందుకూరి రాష్ట్ర స్థాయి రంగస్థల పురస్కరాలను, జిల్లా స్థాయి విశిష్ఠ పురస్కారాలను ప్రకటించారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ప్రతి ఏటా ఏప్రిల్ 16న తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా ఇచ్చే పురస్కారాలు ఇవి! నాటక రంగంలో విశేష కృషి చేసిన ముగ్గురు ప్రముఖులకు కందుకూరి రంగస్థల రాష్ట్రస్థాయి పురస్కారాలు లభించాయి. తెనాలికి చెందిన ప్రముఖ పౌరాణిక రంగస్థల నటుడు ఆరాధ్యుల వెంకటేశ్వరరావు, చిలకలూరిపేటకు చెందిన రచయిత విశ్లేషకులు డా. కందిమళ్ల సాంబశివరావు, నంద్యాలకు చెందిన నట దర్శక ప్రయోక్త డా. గుర్రాల రవికృష్ణ ఎంపికయ్యారు. ఒక్కొక్కరికి లక్ష రూపాయల నగదు, ప్రశంసాపత్రం, కందుకూరి జ్ఞాపికతో సత్కరించనున్నారు. రేపు బుధవారం 16వ తేది సాయంత్రం ఆరు గంటలకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే తెలుగు నాటక రంగ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కొణిదెల పాల్గొని కళాకారులను సత్కరించనున్నారు. 107 మంది కళాకారులను జిల్లా స్థాయిలో కందుకూరి విశిష్ఠ పురస్కరాల కోసం ఎంపిక చేశారు. వీరికి ఒక్కొక్కరికి 10 వేల రూపాయల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సన్మానించనున్నారు. అనంతపురం జిల్లా నుంచి 13 మంది, గుంటూరు జిల్లా నుంచి 12 మంది ఎంపిక కావడం విశేషం.

2025వ సంవత్సరపు కందుకూరి పురస్కారాల ఎంపిక కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి ప్రముఖ సినీ రచయిత బుర్రా సాయి మాధవ్ చైర్మన్ గా వ్యవహరించారు. నాటక అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, రచయిత పాటిబండ్ల ఆనందరావు, చిక్కాల బాలాజీ, కెకెయల్ స్వామి, పి. బాలాజీ నాయక్, దానరి చలపతిరావు (గంగోత్రి సాయి), జి. పద్మజ, బుద్దాల వెంకట రామారావు సభ్యులుగా, ఈఆఅ మేనేజింగ్ డైరెక్టర్ హిమాన్షు శుక్ల కన్వీనర్ గా ఉన్నారు.

కందుకూరి ప్రతిభ పురస్కారం కోసం ఎంపికైన వారు

శ్రీకాకుళం జిల్లా నుంచి గట్టు చిన్నారావు, జె.సూర్యప్రకాష్, కుమారస్వామి నాయక్, బెందాళం శోభన్ బాబు, బెల్లెడ చలపతిరావు, మెట్ట పోలి నాయుడు ఎంపికయ్యారు. పార్వతిపురం మన్యం జిల్లా నుంచి ఆర్.వాసుదేవరావు, కె.మంగావతి, మువ్వల వెంకట రమణ, విజయనగరం జిల్లా నుంచి మీగడ మల్లికార్జునశర్మ, కె.ఎన్.ఎన్.ఆచార్య బాబు, జి. పైడిరాజు, దానరి తిరుమల నాయుడు, వేమలి త్రినాథ రావు, బత్తుల లక్ష్మీ, కె.వి.పద్మావతి, డి. మురళీధర్ ఎంపికయ్యారు. విశాఖపట్నం నుంచి వర్రే నాంచారయ్య, బి.విజయసారధి, కొరిటాల ప్రభాకరరావు, కె.యస్.యన్.మూర్తి, అనకాపల్లి జిల్లా నుంచి పి. ముత్యాలరావు, పెద్దిశెట్టి రామారావు, డి.శివాజీ, పీసీహెచ్ నాయుడు, మడక భాను, కాకినాడ జిల్లా నుంచి కాలవురెడ్డి వెంకటరమణ, నటకుమారి లను ఎంపిక చేశారు. తూర్పు గోదావరి నుంచి కె.సత్తిబాబు, శ్రీలేఖ, నల్లి రవికుమార్, డా.అంబేద్కర్ కోనసీమ నుంచి ద్రాక్షారామం సరోజ, ఏలూరు జిల్లా నుంచి పెద్దపాటి రామకృష్ణ, మహాశివభట్టు వెంకట రాజర్షి ఎంపికయ్యారు.

పశ్చిమ గోదావరి జిల్లా నుంచి అంబటి పెద్ద వెంకటరాజు, గుండా వెంకట సుబ్బారావు, మద్దింశెట్టి సునీతాదేవి, పువ్వాడ విజయ కుమారి, మానాపురం సత్యనారాయణ, టివిఎమ్ కృష్ణారావు, ఎం.భానుమతి, జి.నాగమణి లను ఎంపిక చేశారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి శ్యామనపూడి వెంకటేశ్వరరావు, అగురు త్రినాథ్, వీర్ల వరప్రసాదరావు, నుఖమంచి కోటేశ్వరరావు, హెచ్.వి.ఆర్ ఎస్ ప్రసాద్, బొర్రా నరేష్, కృష్ణా జిల్లా నుంచి జొన్నలగడ్డ జగన్మోహన్ రావు, బత్తిన శివప్రసాద్, గాజులపల్లి కృష్ణ, బి.జయప్రకాశ్, ఎన్.ఉదయ్ భాస్కర్, తీట్ల రాజబాబు లను ఎంపిక చేశారు.

పల్నాడు జిల్లా నుంచి షేక్ షఫీ, బత్తినేని వెంకట సుబ్బయ్య, దేవరపల్లి అన్నపూర్ణమ్మ, వంకాయలపాటి చెన్నకేశవ ప్రసాద్ ఎంపికయ్యారు. గుంటూరు జిల్లా నుంచి భూక్యా శ్రీనివాస్ నాయక్, ఏపూరి హరిబాబు, అయినాల మల్లేశ్వరరావు, ఆరాధ్యుల ఆదినారాయణ, గాదె నాగభూషణం, పొగర్తి నాగేశ్వరరావు, గోపరాజు విజయ్, బి.నాగరాణి, అమృత వర్షిణి, గుడివాడ లహరి, సురభి ప్రభావతి, గుమ్మడి విమలకుమారి లను ఎంపిక చేశారు. బాపట్ల జిల్లా నుంచి లుక్యా సోమేష్, లింగంపల్లి పద్మావతి, పోలూరు సుబ్బారావు ఎంపికయ్యారు.

ప్రకాశం జిల్లా నుంచి మెడసల మల్లికార్జునరావు, అంబడిపూడి శివప్రసాద్, ఉన్నం వెంకట శేషయ్య, నెల్లూరు జిల్లా నుంచి డా.బద్రి పీరకుమార్, గంధం రాజేశ్వరి, కనిమల భానుమతి లను ఎంపిక చేశారు. ఇక కర్నూలు జిల్లా నుంచి గాంధ్ల లక్ష్మన్న, జివి శ్రీనివాస్ రెడ్డి, ఎర్రన పాండురంగయ్య, రామదుర్గం వనారస మంజుల, ఎం.ఆర్.రాధిక ఎంపికయ్యారు.

నంద్యాల జిల్లా నుంచి దాసరి రామసుబ్బయ్య, మఠం శంభు ప్రసాద్, పసుపులేటి సుబ్బరత్న కుమార్, అనంతపురం జిల్లా నుంచి వాల్మీకి కుళ్లాయప్ప, సోమర లక్ష్మీ నారాయణ, సంగాల నారాయణ స్వామి, పి.ఆనంద్, జెకె రామాంజనేయులు, వి.ఆదినారాయణ రెడ్డి, జిజె ఎర్రిస్వామి, ఎ.రామగోపాల్, జి.నరహరి, ఎస్. నారాయణ స్వామి, జి.శివశంకర్, డి.రాజ కుళ్లాయప్ప, బి.వరప్రసాద్ ఎంపికయ్యారు. వైఎస్ఆర్ కడప జిల్లా నుంచి కావడి సుభాష్ చంద్రబోస్, మూల మల్లికార్జున్ రెడ్డి, రావులూరు సుబ్రహ్మణ్యంలను ఎంపిక చేశారు. అన్నమయ్య జిల్లా నుంచి షేక్ ఖాదర్ బాషా, తిరుపతి జిల్లా నుంచి డా.వివేక్ పత్తిపాటి, శంబోలు హరినాథ్, నెల్లూరు కృష్ణమూర్తిలను ఎంపిక చేసినట్లు ప్రకటించారు.

– డా. మహ్మద్ రఫీ

మా జోలికి వస్తే తాట తీస్తాం- బిఆర్ఎస్ కు మంత్రి పొంగులేటి వార్నింగ్

హైదరాబాద్, ఏప్రిల్ 15: దుబ్బాక బిఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. తమ జోలికివస్తే తాట తీస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో అక్రమంగా దోచుకున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలోని పలువురు వ్యాపారులు రేవంత్ సర్కార్ కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారంటూ కొత్త ప్రభాకరరెడ్డి చేసిన వ్యాఖ్యాలను మంత్రి ఖండించారు.. హైదరాబాద్ లో ఆయన విూడియాతో మాట్లాడుతూ, అధికార దాహంతో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని విమర్శించారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి అంటే కేసీఆర్ ఆత్మ అని ఆరోపణలు చేశారు. కేసీఆర్ మాటలనే కొత్త ప్రభాకర్‌రెడ్డి చెప్పారని అన్నారు. ధరణి పోర్టల్‌తో భూములను అక్రమంగా దోచుకుని.. వారి అనుయాయులకు కట్టబెట్టారని ఆరోపించారు. అక్రమంగా దోచుకున్న భూములను తమ ప్రభుత్వం.. వెనక్కి తీసుకుంటుందని బీఆర్ఎస్ నేతలు భయపడుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

కేసీఆర్ ప్రభుత్వంలో అక్రమ సంపాదనతో లాభపడ్డ నేతలే తమ ప్రభుత్వాన్ని కూల్చాలని చూస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లా కొనాలని వారు చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతల తాటాకు చప్పుళ్లకు తాము భయపడమని వార్నింగ్ ఇచ్చారు. తప్పు చేసిన వారికి సంకెళు వేసి తీరుతామని అన్నారు. బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పినా వారి తీరు మారలేదని చెప్పారు. ఎంతమంది ఎమ్మెల్యేలను కొంటారో కొనాలని నవాల్ విసిరారు. ఇందిరమ్మ ప్రభుత్వాన్ని కూల్చి ఆ కుర్చీలో కూర్చోవాలని.. తండ్రీ, కొడుకులు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ప్రభుత్వాన్ని ఎవరూ కూల్చలేరని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

కుట్రకోణంగా భావిస్తున్నాం: ఆది శ్రీనివాస్

బిఆర్ఎన్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఖండించారు. ప్రభుత్వాన్ని పడగొట్టాలనే యత్నాన్ని కుట్రకోణంగా భావిస్తున్నామన్నారు. ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలపై విచారణ జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరతామని చెప్పారు. కుట్రకోణం ఉన్నట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వృద్ధురాలిని హత్య చేసి.. మృతదేహంపై డాన్స్

హైదరాబాద్, ఏప్రిల్ 15:హైదరాబాద్ నగరంలోని కుషాయిగూడలో ఓ కిరాతక ఘటన వెలుగులోకి వచ్చింది. 70ఏళ్ల వృద్ధురాలిని హత్య చేసి, ఆమె మృతదేహంపై డాన్స్ చేస్తూ సెల్ఫీ వీడియో తీసిన యువకుడు స్థానికులను, పోలీసులను షాక్‌కు గురిచేశాడు. ఈ హృదయ విదారక ఘటన నగరంలో తీవ్ర కలకలం రేపింది. కుషాయిగూడలో ఒంటరిగా జీవిస్తున్న కమలాదేవి అనే వృద్ధురాలు కమలాదేవికి చెందిన షాపులో రెంటుకు ఉంటున్నాడు ఆ యువకుడు. అద్దె సరిగ్గా కట్టకపోవడంతో.. అతడ్ని ఆమె మందలించినట్లు తెలుస్తోంది. కమలాదేవిపై కోపంగా ఉన్న యువకుడు ఆమెపై కక్ష్య పెంచుకున్నాడు.

ఈ నేపథ్యంలో ఏప్రిల్ 11వ తేదీన ఈ యువకుడు కమలాదేవిని ఉరివేసి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచి, తాళం వేసి అక్కడి నుంచి పరారయ్యాడు. హత్య చేసిన అనంతరం కమలాదేవి మృతదేహంపై డాన్స్ చేస్తూ సెల్ఫీ వీడియోలు తీసిన అతడు, ఆ వీడియోలను తన స్నేహితులకు పంపించాడు.

వడ్డీ లేని రుణాలతో మహిళలకు స్వయం ఉపాధి - డిప్యూటీ సిఎం భట్టి

హైదరాబాద్, ఏప్రిల్ 15:వడ్డీలేని రుణాలతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశం లభించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తోందని, సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు ఫ్రీ లోన్లు ఇస్తున్నామని చెప్పారు. స్వయం సహాయక గ్రూపులకు రూ.20 వేల కోట్లకు పైగా లోన్లు ఇస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ తాజ్ దక్కన్ హోటల్ లో నేడు జరిగిన నిర్వహించిన స్త్రీ సమ్మిట్ 2.0 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు భట్టి. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రారంభించిన భట్టి మాట్లాడుతూ, మహిళా సాధికారత కోసమే స్త్రీ సమ్మిట్ నిర్వహిస్తున్నామని అన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. ఒకవైపు స్త్రీలను దేవతలుగా చూస్తేనే మరోవైపు కంట్రోల్ చేయాలనే ప్రయత్నం తరతరాలుగా జరుగుతూనే ఉందని అన్నారు. హిందూ కోడ్ బిల్లుతోనే మహిళా సాధికారత ప్రారంభం అయ్యిందని, అంబేద్కర్ వల్లే మహిళలకు హక్కులు లభించాయని గుర్తు చేశారు. మహిళలకు వారతసత్వ హక్కులు లభించాయని తెలిపారు.

తెలంగాణలో మహిళలకు ఫ్రీ బస్ స్కీం సక్సెస్ ఫుల్ గా నడుస్తోందని అన్నారు డిప్యూటీ సీఎం. సోలార్ ప్లాంట్ నిర్వహణ మహిళా సంఘాలకు అప్పగించామని, దీంతో సోలార్ ప్లాంట్ నిర్వహణలో మహిళలకు భాగస్వామ్యం లభించిందని అన్నారు. ఇలాంటి స్త్రీ సమ్మిట్ లతో మహిళా సాధికారత సాధించవచ్చని పిలుపునిచ్చారు.

మహిళల హక్కుల కోసం పార్లమెంట్‌లో అనేక బిల్లులు రూపొందించబడ్డాయని, ఈ దిశగా ఇందిరమ్మ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధిగా ఎదగాలని ప్రభుత్వ ఆకాంక్ష అని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం ద్వారా సంవత్సరానికి రూ. 21,000 కోట్లు విలువైన వడ్డీ లేని రుణాలు మహిళలకు అందుతుండటం విశేషమని చెప్పారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని అని స్పష్టం చేశారు. అంతేకాకుండా.. గ్రీన్ ఎనర్జీ రంగంలో తెరంగాణ మహిళలను భాగస్వామ్యం చేస్తున్నామని, 1000 మెగావాట్ల పునరుత్పత్తి విద్యుత్ ఉత్పత్తికి సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ తో కలిసి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరా శక్తి క్యాంటీన్స్, ఆర్టీసీతో కలిసి మహిళలు భాగస్వామ్యం అవడం, స్థానిక సంస్థలలో 33% రిజర్వేషన్లు వంటి పలు చర్యల ద్వారా మహిళలు తమ పాదాలపై నిలబడేందుకు అవకాశం కల్పిస్తున్నామని వివరించారు.

నేటి నుంచి రేవంత్ రెడ్డి జపాన్ లో పర్యటన

హైదరాబాద్, ఏప్రిల్ 15:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపటి నుంచి జపాన్ లో పర్యటించనున్నారు.. దీని కోసం నేడు ఆయన హైదరాబాద్ నుంచి బయలుదేరనున్నారు.. ఈ పర్యటన 22 వరకు కొననుంది. ఈ పర్యటనలో ఆయన టోక్యో, మౌంట్ ఫుజి, ఒసాకా, హిరోషిమా నగరాలను సందర్శిస్తారు.

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఇతర అధికారులతో కలిసి రేవంత్ ఈ సందర్భంగా ఒసాకా వరల్డ్ ఎక్స్‌పో 2025లో పెవిలియన్‌ను ప్రారంభిస్తారు. ఈ ఎక్స్‌పోలో రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, సాంకేతిక సహకారాన్ని పెంపొందించడం ప్రధాన లక్ష్యం. ఈ పర్యటన ఫలితాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తున్నది.

అధునాతన సాంకేతికత, ఆర్థిక స్థిరత్వం కలిగిన దేశం కావడంతో, అక్కడి కంపెనీలతో ఒప్పందాలు తెలంగాణలో ఉద్యోగ అవకాశాలను సృష్టించవచ్చు. గతంలో రేవంత్ అమెరికా, దక్షిణ కొరియా పర్యటనల్లో 31,500 కోట్ల రూపాయల పెట్టుబడులను సాధించారు. ఈ నేపథ్యంలో, జపాన్ పర్యటన కూడా ఇలాంటి విజయాన్ని అందిస్తుందని ఆశాభావం ఉంది. ముఖ్యంగా ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో సహకారం పెరిగే అవకాశం ఉందిఒసాకా ఎక్స్‌పోలో తెలంగాణ పెవిలియన్ ఏర్పాటు రాష్ట్రాన్ని అంతర్జాతీయంగా ప్రమోట్ చేసేందుకు దోహదపడుతుంది. ఈ వేదిక ద్వారా రాష్ట్ర సంస్కృతి, సామర్థ్యాలను ప్రదర్శించడం ద్వారా టూరిజం, వాణిజ్య రంగాల్లో అవకాశాలు మెరుగుపడతాయి. అదే సమయంలో, జపాన్‌తో సాంకేతిక భాగస్వామ్యం తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ అభివృద్ధికి ఉపయోగపడుతుంది. జపాన్ నైపుణ్య శిక్షణ, ఆవిష్కరణలలో ముందుండటంతో, ఈ సహకారం రాష్ట్ర యువతకు నూతన దిశను అందించవచ్చు. అయితే, ఈ పర్యటన విజయం అమలు తీరుపై ఆధారపడి ఉంటుంది. ఒప్పందాలు కాగితాలకే పరిమితం కాకుండా, ఆచరణలోకి వస్తేనే నిజమైన ఫలితాలు కనిపిస్తాయి. గతంలో పలు ప్రభుత్వాలు పెట్టుబడులు తెచ్చినప్పటికీ, అమలులో జాప్యం వల్ల ప్రయోజనం పూర్తిగా దక్కలేదు. రేవంత్ ఈ అంశంలో పకడ్బందీ చర్యలు తీసుకుంటే, జపాన్ పర్యటన తెలంగాణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది

గులాబీ జాతరకు అన్ని ఏర్పాట్లు చేశాం : మాజీ ఎంపీ వినోద్ కుమార్

వరంగల్, ఏప్రిల్ 15: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి శివారులో ఈనెల 27 న నిర్వహించనున్న గులాబీ పార్టీ రజతోత్సవ భారీ బహిరంగ సభకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ తెలిపారు. ఎల్కతుర్తి బహిరంగ సభ ఏర్పాట్లను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గులాబీ జాతరకు రాష్ట్రం నలుమూలలనుంచి భారీ సంఖ్యలో ప్రజలు, గులాబీ కార్యకర్తలు తరలిరానున్నట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. భారీ బహిరంగ సభ దిగ్విజయం కావడం ఖాయమన్నారు. తెలంగాణ రాష్ట్రం తెస్తామని చెప్పి? తెచ్చి చూపించి తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌దేనన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ఆరు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం అభాసుపాలైందని.. ప్రజా క్షేత్రంలో గెలుపు ఓటములు సహజమన్న ఆయన.. ప్రజల మద్దతుతో తిరిగి అధికారంలోకి వస్తామని స్పష్టం చేశారు.

ప్రసిద్ధ మైదానంలోని పెవిలియన్‌కు పేరు.. భారత కెప్టెన్‌కు అరుదైన గౌరవం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: భారత కెప్టెన్ రోహిత్ శర్మకు అరుదైన గౌరవం లభించనుంది.

ముంబై క్రికెట్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. వాంఖడే మైదానంలోని ఒక స్టాండ్‌కు రోహిత్ పేరు పెట్టనుంది.

ఈ విషయాన్ని మంగళవారం ఎంసీఏ ప్రతినిధులు మీడియాకు వెల్లడించారు.

ఐపీఎల్ 18వ సీజన్ సందర్భంగా సన్ రైజర్స్‌తో మ్యాచ్ సమయంలోనే రోహిత్ పెవిలియన్‌ను ఆవిష్కరించే అవకాశముంది.

మంగళవారం ముంబై క్రికెట్ అసోసియేషన్ వార్షిక సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా వాంఖడేలోని స్టాండ్స్‌కు క్రికెట్ దిగ్గజాల పేర్లపై చర్చించారు అధికారులు.

ఈ క్రమంలోనే భారత జట్టుకు, ముంబై క్రికెట్‌కు విశేష సేవలందించిన హిట్‌మ్యాన్‌ను గొప్పగా గౌరవించాలని అనుకున్నారంతా.

'వాంఖడేలోని దెవిచ పెవిలియన్‌కు రోహిత్ శర్మ స్టాండ్‌గా నామకరణం చేయాలని తీర్మానించాం' అని ఎంసీఏ అధ్యక్షుడు అజింక్యా నాయక్ తెలిపాడు.

కంఠ స్వరాన్ని శక్తివంతం చేద్దాం !

(16 ఏప్రిల్ “ప్రపంచ కంఠ స్వర (వాయిస్) దినోత్సవం” సందర్భంగా)

మన కంఠ స్వరమే మన గుర్తింపు. కంఠ స్వరమే సంభాషణలకు పునాది. మన స్వరం మనకు ఖ్యాతిని ఆర్జించి పెడుతుంది. మన వాయిస్ సాగినంత కాలం దాని ప్రాధాన్యం తెలియదు. గొంతు పెకలడం మానేస్తే మన కంఠ స్వర శక్తి ఎంతో తెలుస్తుంది. స్వర ఆరోగ్య పరిరక్షణకు మనం తీసుకునే జాగ్రత్తలు చాలా తక్కువ. పౌర సమాజంతో సమాచార వితరణకు స్వరమే మూలాధారం. గట్టిగా అరవడం, కీచు గొంతుతో ఝూంకారం చేయడం, గట్టిగా నవ్వటం, ఏడ్వడం, పాటలు పాడడం, పడని ద్రవ ఆహార పదార్థాలను తీసుకోవడం, సంభాషణా చాతుర్య మెలకువలు తెలవకపోవడం, పొగ తాగడం లాంటి పలు కారణాలతో మన కంఠ స్వరం అనారోగ్యం పాలు అవుతుందని మనకు తెలుసు. కంఠ స్వరం తడబడిన వేళ సత్వరమే గొంతు వైద్యులను సంప్రదించడం విధిగా చేయాలి.

ప్రపంచ కంఠ స్వర దినోత్సవం – 2025 ఇతివృత్తం:

మన కంఠ స్వర ఆరోగ్య పరిరక్షణ పట్ల అవగాహన కల్పించడానికి, వాయిస్‌ను ప్రభావితం చేసే అంశాలను ప్రచారం చేయడానికి ప్రతి ఏట 16 ఏప్రిల్ రోజున “ప్రపంచ కంఠ స్వర దినోత్సవం” లేదా “వరల్డ్ వాయిస్ డే” పాటించడం ఆనవాయితీగా మారింది. 2025 ప్రపంచ వాయిస్ దినోత్సవం ఇతివృత్తంగా “కంఠ స్వరాన్ని శక్తివంతం చేయండి (ఎంపవర్ యువర్ వాయిస్)” అనబడే అంశాన్ని తీసుకున్నారు. వాయిస్‌లో వచ్చే ప్రతికూల మార్పులను తొలి దశలో గుర్తించడం, సరైన వైద్య చికిత్సలు పొందడం, స్వర సంబంధ ఆరోగ్య పరిరక్షణ పరిశోధనలు కొనసాగించడం, వాయిస్ సమస్యలు ఉన్న వారికి చేయూత ఇవ్వడం, కంఠ స్వర ఆధార కళాకారులను తగు రీతిలో మార్గ నిర్దేశనా చేయడం, వాయిస్ ఆరోగ్య పరిరక్షణకు ముందస్తు జాగ్రత్తలు అవగాహన పరచడం లాంటి అంశాలతో సమాధానం చెప్పవచ్చు.

పాటలు పాడే కళాకారులు, నాటక రంగ కళాకారులు, ఉపాధ్యాయులు, మోటివేషనల్ స్పీకర్స్, ప్రవచనకర్తలు, ఇతర స్వర ఆధార విధులు నిర్వహించే వారు మాత్రం తమ వాయిస్ ఆరోగ్య సంరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. కంఠ స్వరం మారినట్లు గమనించిన వెంటనే ఈఎన్‌టీ వైద్యుల సలహాలను పొందడానికి అలసత్వం పనికి రాదు. నిత్యం హైడ్రేట్ కావడం లేదా గొంతు తడారకుండా చూసుకోవడం, సరైన స్వర స్థాయిని ఎన్నుకోవడం, తరుచుగా వైద్యుల సలహాలు తీసుకోవడం లాంటి జాగ్రత్తలను పాటిస్తూ, మన కంఠ స్వరంతో పౌర సమాజంతో సత్సంబంధాలను కొనసాగిద్దాం, సరైన వాయిస్ వాడి ఇతరుల మనసు దోచేసుకుందాం.

–డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

బీచ్ ఫెస్టివల్‌లో క్రీడాస్ఫూర్తి ప్రతిబింబించాలి- శాప్ చైర్మన్ రవినాయుడు

అమరావతి, ఏప్రిల్ 15:మంగినపూడిలో మే 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ మంత్రి కొల్లు రవీంద్ర ప్రత్యేక పర్యవేక్షణలో జరిగే బీచ్ ఫెస్టివల్‌లో క్రీడాస్ఫూర్తి ప్రతిబింబించేలా జాతీయస్థాయి కబడ్డీ, జల క్రీడలను నిర్వహించాలని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయుడు సూచించారు. విజయవాడ శాప్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ జిల్లాల డీఎస్డీఓలు, కబడ్డీ, కెనాయింగ్ అండ్ కయాకింగ్ అసోసియేషన్ల నిర్వాహకులతో క్రీడల నిర్వహణపై మంగళవారం ఆయన సమీక్షించారు.

ఈసందర్భంగా శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బీచ్ ఫెస్టివల్‌లో స్పోర్ట్స్ అథారిటీకి ఆదేశించిన క్రీడా పోటీలను సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. పక్కా ప్రణాళికలతో పకడ్బందీగా క్రీడాపోటీలను నిర్వహించి శాప్ గౌరవాన్ని మరింత పెంచాలని, దానికోసం క్రీడా అసోసియేషన్లతో పాటు డీఎస్డీఓలందరూ సమిష్టి కృషితో పనిచేయాలన్నారు. క్రీడలు నిర్వహించే అసోసియేషన్లకు శాప్ నుంచి కల్పించాల్సిన వసతులు, సౌకర్యాల ఏర్పాట్లను త్వరితగతిన తెలియజేయాలన్నారు. క్రీడల నిర్వహణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులకు అనుగుణంగా మెరుగైన క్రీడా వసతులు ఏర్పాటు చేయాలని వివరించారు.

ఈసందర్భంగా స్పోర్ట్స్ అసోసియేషన్ల నిర్వాహకులు మాట్లాడుతూ కబడ్డీకి సంబంధించి 29 పురుషుల జట్లు, 29 మహిళా జట్లు పాల్గొంటాయన్నారు. అలాగే బోట్ రేసింగ్, ట్రెడిషనల్ బోట్, సీ కాయిటింగ్ పోటీలకు వివిధ రాష్ట్రాలకు చెందిన జాతీయ క్రీడాకారులు హాజరవుతారని వెల్లడించారు. దీనిపై శాప్ ఛైర్మన్ బదులిస్తూ క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో వసతులు కల్పించే బాధ్యత స్పోర్ట్స్ అథారిటీ తీసుకుంటుందన్నారు. బీచ్‌లో క్రీడా కోర్టులకు అనుగుణంగా ఉండే ప్రాంతాలను తక్షణమే గుర్తించాలని సూచించారు. అలాగే స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్, టెక్నికల్ టీమ్, కోచ్‌లు, రిఫరీలు, వలంటీర్లను సన్నద్ధం చేయాలన్నారు. ముఖ్యంగా క్రీడాకారుల ప్రయోజనార్థం ట్రాన్స్‌పోర్ట్, పోలీసింగ్, ఫైర్, మెడికల్ క్యాంపులు, ప్రత్యేక కమిటీల పర్యవేక్షణపై దృష్టి సారించాలన్నారు. క్రీడా కోర్టులు, వేదికలు, గ్యాలరీల ఏర్పాట్లలో ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు.

అంతర్జాతీయ క్రీడాపోటీలను తలపించాలి..

బీచ్ ఫెస్టివల్‌లో క్రీడలు ఒక భాగంగా కాకుండా అంతర్జాతీయ క్రీడాపోటీలను తలపించేలా సమర్థవంతంగా నిర్వహించాలని శాప్ ఛైర్మన్ రవినాయుడు ఆదేశించారు. సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, పెద్ద ఎత్తున విచ్చేసే వీక్షకుల్లో క్రీడాస్ఫూర్తిని రగిలించేలా శాప్ కృషి చేయాలన్నారు. క్రీడాకారులందరూ అత్యుత్తమ ప్రదర్శనను కనబరచడంతో పాటు క్రీడా వాతావరణాన్ని నెలకొల్పాలన్నారు. అసోసియేషన్ల నిర్వాహకులు, డీఎస్డీఓలు, కోచ్‌లు అందరూ అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు అదనంగా కావాల్సిన వసతులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మనం నిర్వహించే క్రీడలు మరింత మందిలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలన్నారు. ముఖ్యంగా ఈ బీచ్ ఫెస్టివల్‌లో క్రీడలు విజయవంతమవ్వాలంటే విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ముందుగానే రోజుకొక కార్యక్రమాన్ని చేపట్టి పెద్ద ఎత్తున ప్రచారం చేయాలన్నారు. దానికి సంబంధించి డిజిటల్, సోషల్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఈడీ సాయిబాబా, శాప్ ఏఓ ఆర్.వెంకటరమణ నాయక్, పలువురు డీఎస్డీఓలు, కోచ్‌లు పాల్గొన్నారు.

14 ఏళ్ల కిందట ప్రతినబూనిన శ్రీ రాంపాల్ కశ్యప్‌తో ముచ్చటించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు హర్యానాలోని యమునా నగర్ పరిధిలోగల కైతాల్‌లో శ్రీ రాంపాల్ కశ్యప్‌ను కలుసుకున్నారు. తాను ప్రధాని కావాలని, ఆ తర్వాత తనను కలిసేదాకా పాదరక్షలు ధరించబోనని కశ్యప్ 14 ఏళ్ల కిందట ప్రతిజ్ఞ చేసిన సంగతి తెలుసుకుని శ్రీ మోదీ గౌరవ పూర్వకంగా స్పందించారు. సామాజిక సేవ, దేశ ప్రగతి సంబంధిత అర్థవంతమైన కార్యకలాపాలపై పౌరులు తమ శక్తిసామర్థ్యాలను కేంద్రీకరించాలని సూచించారు.

“యమునానగర్‌లో నేటి బహిరంగ సభ సందర్భంగా కైతాల్ వాస్తవ్యులు శ్రీ రాంపాల్ కశ్యప్ గారిని నేను కలిశాను. నేను ప్రధానమంత్రి కావాలని, అటుపైన నన్ను కలిసేదాకా పాదరక్షలు ధరించబోనంటూ ఆయన 14 ఏళ్ల కిందట శపథం చేశారట!

రాంపాల్ జీ వంటివారికి నా సవినయ వందనాలు. నాపై వారి ఆప్యాయతానురాగాలను స్వాగతిస్తున్నాను. అయితే, ఇటువంటి ప్రతినలు చేసే ప్రతి ఒక్కరికీ ఇదే నా అభ్యర్థన– మీ ప్రేమాభిమానాలకు హృదయపూర్వక కృతజ్ఞతలు. దయచేసి సామాజిక సేవ, దేశ ప్రగతితో ముడిపడిన అర్థవంతమైన కార్యకలాపాల కోసం మీ శక్తిసామర్థ్యాలను కేంద్రీకరించండి!” అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

వికసిత్ భారత్‌ను సాకారం చేసే కృషిలో బాబాసాహెబ్ అంబేద్కర్ ఆదర్శాలకు కట్టుబడి ఉంటామని పౌరులు పునరుద్ఘాటించాలి: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:‘వికసిత్ భారత్’ (అభివృద్ధి చెందిన భారత్)ను సాకారం చేసే దిశగా బాబాసాహెబ్ అంబేద్కర్ ఆదర్శాలకు కట్టుబడి పనిచేస్తామని పునరుద్ఘాటించాల్సిందిగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దేశపౌరులకు ఈ రోజు పిలుపునిచ్చారు. రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పొందుపరిచిన ఒక సందేశానికి శ్రీ మోదీ ప్రతిస్పందిస్తూ ఇలా పేర్కొన్నారు:

“ఆధునిక భారతదేశ గొప్ప ఆలోచనపరులలోనూ, సంస్థలను ఏర్పాటు చేయడంలోనూ బాబాసాహెబ్ ఒకరని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఒక వ్యాసంలో రాశారు. ప్రధాన సంస్థల ఏర్పాటులో డాక్టర్ అంబేద్కర్ పోషించిన పాత్రను ఆయన గుర్తు తెచ్చుకొన్నారు. అంతేకాకుండా ‘వికసిత్ భారత్’ను సాకారం చేసే దిశలో బాబాసాహెబ్ ఆదర్శాలకు కట్టుబడి ముందుకు దూసుకుపోతామంటూ పౌరులు తమ నిబద్ధతను పునరుద్ఘాటించాలని కూడా కోరారు.”

హిసార్‌లో రూ.410 కోట్లకుపైగా వ్యయంతో నిర్మించే విమానాశ్రయ కొత్త టెర్మినల్ భవనానికి ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ శంకుస్థాపన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:దేశ ప్రజలందరికీ సురక్షిత, సౌలభ్య విమాన ప్రయాణాన్ని అందుబాటులోకి తేవాలన్న సంకల్పం మేరకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు హర్యానాలోని హిసార్‌లో రూ.410 కోట్లపైగా వ్యయంతో నిర్మించే మహారాజా అగ్రసేన్ విమానాశ్రయం కొత్త టెర్మినల్ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ– హర్యానా ప్రజల శక్తిసామర్థ్యాలు, క్రీడాస్ఫూర్తి, సోదరభావం రాష్ట్రానికి ప్రతీకలుగా అభివర్ణిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుత ముమ్మర పంట కోతల వేళ కూడా పెద్ద సంఖ్యలో ఆశీర్వదించేందుకు వచ్చారంటూ ప్రజలకు తజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో భాగంగా గురు జంభేశ్వర్, మహారాజా అగ్రసేన్లతో పాటు పవిత్ర అగ్రోహా క్షేత్రానికి ప్రధానమంత్రి సగౌరవ నివాళి అర్పించారు. హర్యానా... ముఖ్యంగా హిసార్కు సంబంధించి తన మధుర జ్ఞాపకాలను ప్రజలతో పంచుకున్నారు. బీజేపీ తనకు రాష్ట్రశాఖ బాధ్యతలు అప్పగించిన సమయంలో అనేకమంది సహచరులతో భుజం కలిపి పార్టీ బలోపేతానికి కృషి చేశానని గుర్తుచేసుకున్నారు. ఈ క్రమంలో వారు ప్రదర్శించిన అంకితభావం, కఠోర పరిశ్రమను ప్రముఖంగా ప్రస్తావించారు. వికసిత హర్యానా, వికసిత భారత్ సంకల్పంపై పార్టీ నిబద్ధత తనకెంతో గర్వకారణమని, ఈ దిశగా అందరూ అకుంఠిత దీక్షతో శ్రమిస్తున్నారని పేర్కొన్నారు.

“నేడు మన రాజ్యాంగ రూపకర్త బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి. ఇది మనకే కాకుండా దేశం మొత్తానికీ అత్యంత ముఖ్యమైన రోజు” అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వ 11 సంవత్సరాల పాలనకు బాబాసాహెబ్ జీవితం, పోరాటాలు, సందేశం మూలస్తంభాలని ఆయన స్పష్టం చేశారు. ఆ మేరకు ప్రతి నిర్ణయం.. విధానం సహా అనునిత్యం పరిపాలన బాబాసాహెబ్ దార్శనికతకు అంకితమై కొనసాగిందని పేర్కొన్నారు. దుర్బల, అణగారిన, దోపిడీకి గురైన పేద, గిరిజన వర్గాలు సహా మహిళల జీవనం మెరుగుకు, వారి కలల సాకారానికి ప్రభుత్వం నిబద్ధతతో కృషి చేస్తున్నదని పునరుద్ఘాటించారు. ఈ లక్ష్యాలన్నీ సాధించే దిశగా నిరంతర, వేగవంతమైన ప్రగతి తారకమంత్రంగా తమ ప్రభుత్వం ముందంజ వేస్తున్నదని చెప్పారు.

హర్యానా–అయోధ్య క్షేత్రాలను నేరుగా అనుసంధానిస్తూ విమానయాన సేవలకు శ్రీకారం చుట్టడాన్ని ప్రస్తావిస్తూ– శ్రీకృష్ణుని పావన భూమికి, శ్రీరాముని దివ్య ధామానికిగల ప్రత్యక్ష సంబంధానికి ఇదొక ప్రతీక అని ప్రధానమంత్రి అభివర్ణించారు. ఇదేవిధంగా ఇతర నగరాలకూ త్వరలోనే విమానయాన సేవలు ప్రారంభమవుతాయని ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా హిసార్ విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ భవనానికి శంకుస్థాపన చేయడాన్ని ప్రస్తావిస్తూ హర్యానా ఆకాంక్షలకు రెక్కలు తొడిగే దిశగా ఇదొక ముందడుగని వ్యాఖ్యానించారు. ఈ కీలక ఘట్టం నేపథ్యంలో హర్యానా ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు.

సాధారణ స్లిప్పర్లు ధరించేవారు కూడా విమానయానం చేయడం సాధ్యమేనన్న తన దృక్కోణాన్ని గుర్తుచేస్తూ– తన ఈ వాగ్దానం నేడు దేశమంతటా సాకారం అవుతున్నదని పేర్కొన్నారు. ఈ మేరకు గత పదేళ్లలో లక్షలాది భారతీయులు తొలిసారి విమాన ప్రయాణ అనుభవం పొందారని శ్రీ మోదీ పునరుద్ఘాటించారు. ఇంతకుముందు సరైన రైల్వే స్టేషన్ సదుపాయం కూడా లేని ప్రాంతాల్లో ఇవాళ కొత్త విమానాశ్రయాలు నిర్మితమవుతున్నాయని చెప్పారు. ఆ మేరకు 2014కు ముందు.. అంటే– దాదాపు 7 దశాబ్దాలు గడిచేసరికి దేశంలో విమానాశ్రయాల సంఖ్య 74 మాత్రమేనని గుర్తుచేశారు. అయితే, గత పదేళ్లలోనే ఈ సంఖ్య 150కి చేరగా, రెట్టింపు పెరుగుదల నమోదైందని పేర్కొన్నారు. ఇక ‘ఉడాన్’ పథకం కింద దాదాపు 90 ఏరోడ్రోమ్‌లు అనుసంధానితం కాగా, 600కిపైగా మార్గాల్లో విమాన రాకపోకలు సాగుతున్నాయని తెలిపారు. దీనివల్ల అధికశాతం ప్రజానీకానికి సరసమైన ధరతో విమాన యానం అందుబాటులోకి వచ్చిందని వివరించారు. పర్యవసానంగా వార్షిక విమాన ప్రయాణికుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరిగిందని వెల్లడించారు. అలాగే వివిధ విమానయాన సంస్థలు రికార్డు స్థాయిలో 2,000 కొత్త విమానాల కోసం ఆర్డర్లిచ్చాయని పేర్కొన్నారు. దీనివల్ల పైలట్లు, విమాన సేవికలు, ఇతరత్రా సేవల సిబ్బంది రూపంలో అనేక మందికి ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. దీంతోపాటు విమానాల నిర్వహణ రంగంలోనూ గణనీయ ఉపాధి అవకాశాల సృష్టికి వీలుంటుందని తెలిపారు. ఈ క్రమంలో “హిసార్ విమానాశ్రయం హర్యానా యువత ఆకాంక్షలకు రెక్కలు తొడిగి, కొత్త అవకాశాలతో వారి కలల సాకారంలో తనవంతు పాత్ర పోషిస్తుంది” అన్నారు.

“మా ప్రభుత్వం ఇటు అనుసంధానానికి ప్రాధాన్యమిస్తూ, అటు పేదల సంక్షేమం–సామాజిక న్యాయం ద్వారా బాబాసాహెబ్ అంబేద్కర్ దార్శనికతను సాకారం చేస్తూ రాజ్యాంగ రూపకర్తల ఆశయాలను నెరవేరుస్తోంది” అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. బాబాసాహెబ్ విషయంలో కాంగ్రెస్ పార్టీ తీరును విమర్శిస్తూ– ఆయనను ఎంతో అవమానించిందని, రెండుసార్లు ఆయన ఎన్నికలలో ఓడిపోయేందుకు కారణమయ్యారని వ్యవస్థ నుంచి ఆయనను నెట్టివేసేందుకు కుట్రలు చేశారని ఆరోపించారు. ఇక బాబాసాహెబ్ మరణానంతరం ఆయన వారసత్వాన్ని రూపుమాపేందుకు, ఆ మహనీయుడి ఆలోచనలను భూస్థాపితం చేసేందుకు కాంగ్రెస్ యత్నించిందని వ్యాఖ్యానించారు. డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగ రక్షకుడైతే, వారు దాని విధ్వంసకులని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. డాక్టర్ అంబేద్కర్ దేశంలో సమానత్వ సాధనకు కృషి చేస్తే, కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయ వైరస్‌ను వ్యాప్తి చేసిందని ఆరోపించారు.

దేశంలో ప్రతి పేదకు, అణగారిన వ్యక్తికి గౌరవప్రద జీవితమిచ్చే ధ్యేయంతో వారి కలలు, ఆకాంక్షలు నెరవేరేందుకు చేయూతనిచ్చారని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం తన సుదీర్ఘ పాలన కాలంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణించిందని ఆయన విమర్శించారు. నాటి పాలకుల హయాంలో అసమానతలను ప్రస్ఫుటం చేస్తూ– కొందరు నాయకుల ఈతకొలనులకు నీరందిందిగానీ, గ్రామాల దాహార్తి మాత్రం తీరలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక 70 ఏళ్లకు కూడా కొళాయి కనెక్షన్లు గ్రామీణ కుటుంబాలలో 16 శాతానికి మాత్రమే పరిమితమయ్యాయని గుర్తుచేశారు. ఫలితంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల ప్రయోజనాలు అసమతౌల్యానికి గురయ్యాయని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, గడచిన 6–7 ఏళ్ల వ్యవధిలోనే తమ ప్రభుత్వం 12 కోట్లకుపైగా గ్రామీణ కుటుంబాలకు కొళాయి కనెక్షన్లు ఇచ్చిందని, తద్వారా 80 శాతం నివాసాలకు సురక్షిత నీరు అందుతున్నదని ఆయన వివరించారు. బాబాసాహెబ్ ఆశీర్వాదంతో ఇంటింటికీ కొళాయి నీటి సరఫరా లక్ష్యం సాకారం కాగలదని విశ్వాసం వెలిబుచ్చారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలను తీవ్రంగా ప్రభావితం చేసిన మరుగుదొడ్ల కొరత సమస్యను కూడా ఆయన ప్రస్తావించారు. దీనికి శాశ్వత పరిష్కారంలో భాగంగా దేశంలో 11 కోట్లకుపైగా మరుగుదొడ్లను నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ విధంగా ప్రభుత్వ నిరంతర కృషితో గౌరవప్రదమైన జీవితంపై ప్రజలకు భరోసా లభించిందని చెప్పారు.

మునుపటి ప్రభుత్వాల హయాంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు అనేక అవరోధాలు, ఆటంకాలు తప్పలేదని ప్రధానమంత్రి గుర్తుచేశారు. బ్యాంకు లావాదేవీల సౌలభ్యం వారికి అందని ద్రాక్షలా ఉండేదని, బీమా సదుపాయంతోపాటు రుణలభ్యత, ఆర్థిక సహాయం కలలకు మాత్రమే పరిమితమని అన్నారు. కానీ, తమ ప్రభుత్వ హయాంలో జన్‌ధన్ ఖాతాల ద్వారా అత్యధికంగా లబ్ధి పొందుతున్నది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలవారేనని ఆయన స్పష్టం చేశారు. ఈ లబ్ధిదారులంతా నేడు తమ రూపే కార్డులను నిండు విశ్వాసంతో చూపగలగడం వారి ఆర్థిక సార్వజనీనత, సాధికారతకు ప్రతీక అని ఆయన సగర్వంగా ప్రకటించారు.

అధికార సముపార్జనకు ఒక ఉపకరణంగా కాంగ్రెస్ పార్టీ పవిత్ర రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేసిందని శ్రీ మోదీ విమర్శించారు. అధికార సంక్షోభం తలెత్తినప్పుడల్లా రాజ్యాంగాన్ని ఘోరంగా ధిక్కరించిందని ఆరోపించారు. అధికారం నిలబెట్టుకునే ప్రయత్నంలో రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసిన ఎమర్జెన్సీ గురించి ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రజలందరికీ ఉమ్మడి పౌరస్మృతి రూపకల్పనే రాజ్యాంగ ప్రబోధమని, అప్పటి ప్రభుత్వం దాన్ని ఎన్నడూ పాటించింది లేదని స్పష్టం చేశారు. మరోవైపు రాజ్యాంగ సూత్రాలకు అనుగుణంగా ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి అమలుకు శ్రీకారం చుడితే ప్రతిపక్షం వ్యతిరేకించిందని గుర్తుచేశారు.

దేశంలోని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు రాజ్యాంగం రిజర్వేషన్లు కల్పిస్తే కాంగ్రెస్ దాన్నొక బుజ్జగింపు ఉపకరణంగా మార్చుకున్నదని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. మరోవైపు రాజ్యాంగం విరుద్ధమైనప్పటికీ కర్ణాటకలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మతం ప్రాతిపదికన ప్రభుత్వ టెండర్లలో రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు వార్తా కథనాలు వచ్చాయని తెలిపారు. వాస్తవానికి బుజ్జగింపు విధానాలు కొందరు తీవ్రవాదులకు ఉపయోగపడ్డాయిగానీ, ముస్లిం సమాజానికి ఎంతో హాని చేశాయన్నారు. వారికి చదువుసంధ్యలు లేకుండా చేసి, పేదరికంలోకి నెట్టాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ లోపభూయిష్ఠ విధానాలకు తిరుగులేని రుజువు వక్ఫ్ చట్టమేనని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఎన్నికలకు కొన్ని నెలల ముందుగా 2013లో తన ఓటు బ్యాంకును సంతృప్తి పరచడానికి నాటి కాంగ్రెస్ సర్కారు అనేక రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఈ చట్టాన్ని సవరించిందని చెప్పారు.

ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తామంటూ అర్థవంతమైన చర్యలేవీ తీసుకోలేదని కాంగ్రెస్‌ను ప్రధాని విమర్శించారు. వారికి నిజంగా ముస్లిం సమాజంపై శ్రద్ధ ఉంటే, తమ పార్టీ అధ్యక్షుడిగా ముస్లింను నియమించి ఉండేవారని లేదా ముస్లిం అభ్యర్థులకు 50 శాతం టికెట్లు ఇచ్చేవారని అన్నారు. వారి ఆలోచనలలో ఏనాడూ ముస్లింల వాస్తవ సంక్షేమానికి తావులేకపోవడమే వారి నిజ స్వరూపానికి నిదర్శనమని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. పేదలు, నిరాశ్రయులైన మహిళలు, పిల్లల ప్రయోజనాలకు ఉద్దేశించిన విస్తృత వక్ఫ్ భూములను భూ మాఫియాలు దోపిడీ చేస్తున్నాయని చెప్పారు. అంతేకాకుండా దళితులు, వెనుకబడిన తరగతులు, గిరిజనుల భూములను కూడా ఆక్రమించుకుంటున్నాయని తెలిపారు. చివరకు పస్మాంద ముస్లిం సమాజానికీ ఎలాంటి ప్రయోజనాలు దక్కలేదని శ్రీ మోదీ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో వక్ఫ్ చట్టానికి సవరణ ద్వారా అటువంటి దోపిడీకి అడ్డుకట్ట పడిందని చెప్పారు. వక్ఫ్ బోర్డులు ఇకపై గిరిజన భూముల జోలికి వెళ్లకుండా సవరించిన చట్టంలో కొత్తగా కీలక నిబంధనను జోడించామని తెలిపారు. గిరిజన ప్రయోజనాల పరిరక్షణలో ఇదొక ముందడుగని ఆయన పేర్కొన్నారు. కొత్త నిబంధనలు వక్ఫ్ పవిత్రతను గౌరవిస్తూ పేదలతోపాటు పస్మాంద ముస్లిం కుటుంబాలు, మహిళలు, బాలల హక్కులను కాపాడతాయన్నారు. ఇది రాజ్యాంగం ప్రబోధించే వాస్తవిక స్ఫూర్తిని, సామాజిక న్యాయాన్ని ప్రతిబింబిస్తుందని స్పష్టం చేశారు.

బాబాసాహెబ్ అంబేద్కర్ వారసత్వాన్ని గౌరవించడంతోపాటు భవిష్యత్తరాలకు స్ఫూర్తినిచ్చేలా 2014 నుంచి ప్రభుత్వం చేపట్టిన అనేక చర్యలను ప్రధానమంత్రి ఉటంకించారు. దేశవిదేశాలలో ఆయనతో ముడిపడిన ప్రదేశాలు దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆయన గుర్తుచేశారు. చివరకు ముంబయిలోని ఇందు మిల్లులో బాబాసాహెబ్ స్మారకం నిర్మాణం కోసం ప్రజలు ఆందోళన చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అయితే, తమ ప్రభుత్వం బాబాసాహెబ్ జన్మస్థలమైన మధ్యప్రదేశ్‌లోని “మౌ”, సహా లండన్‌లోని ఆయన విద్యాభ్యాస ప్రదేశం, ఢిల్లీలోని మహాపరినిర్వాణ్ స్థల్ (సమాధి), నాగ్‌పూర్‌లోని దీక్షాభూమి”తోపాటు అన్ని కీలక స్థలాలను చక్కగా తీర్చిదిద్ది, ‘పంచతీర్థం’ పేరిట సందర్శక ప్రదేశాలుగా మార్చిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇటీవల దీక్షాభూమిని సందర్శించి నివాళి అర్పించే అవకాశం తనకు లభించిందని ఆయన పేర్కొన్నారు. సామాజిక న్యాయంపై కాంగ్రెస్ వాగాడంబరం ప్రదర్శించిందని, బాబాసాహెబ్‌తోపాటు చౌదరి చరణ్ సింగ్‌ను ‘భారతరత్న’ పురస్కారంతో సత్కరించడంలో విఫలమైందని ప్రధాని విమర్శించారు. కేంద్రంలో బిజెపి మద్దతుగల ప్రభుత్వ హయాంలోనే బాబాసాహెబ్‌కు ఈ అత్యున్నత పురస్కార ప్రదానం చేయగా, చౌదరి చరణ్ సింగ్‌ను ఆ అవార్డుతో సత్కరించింది కూడా తమ పార్టీయేనని ఆయన సగర్వంగా వివరించారు.

పేదల సంక్షేమం, సామాజిక న్యాయ పథాన్ని బలోపేతం చేసినందుకు హర్యానా ప్రభుత్వం నిరంతర కృషి చేస్తున్నదని ప్రధాని ప్రశంసించారు. గత ప్రభుత్వాల హయాంలో ప్రభుత్వ ఉద్యోగాల పరిస్థితి దారుణంగా ఉండేదని, ఉపాధి కోసం రాజకీయ సంబంధాలపై ఆధారపడాల్సి వచ్చిందని లేదా కుటుంబ ఆస్తులను అమ్ముకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ ప్రభుత్వం ఇటువంటి అవినీతి పద్ధతులను నిర్మూలించడం తనకెంతో సంతృప్తినిచ్చిందని చెప్పారు. లంచాలు, సిఫారసులు లేకుండా ఉద్యోగాలివ్వడంలో హర్యానా అద్భుత రికార్డు నెలకొల్పిందని కొనియాడారు. హర్యానాలో 25,000 మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు దక్కకుండా గత ప్రభుత్వాలు ఎన్నో కుయుక్తులు పన్నాయని ఆయన ఆరోపించారు. కానీ, ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ పదవీ బాధ్యతలు చేపట్టగానే అర్హులైన అభ్యర్థులకు వేలాదిగా నియామక లేఖలు జారీచేశారని గుర్తుచేశారు. తమ పార్టీ సుపరిపాలనకు ఇదొక ఉదాహరణగా ఆయన అభివర్ణించారు. భవిష్యత్తులో వేలాది కొత్త ఉద్యోగాల సృష్టికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించడం ప్రశంసనీయమన్నారు.

దేశ రక్షణకు హర్యానా గణనీయ స్థాయిలో తోడ్పడిందని, సాయుధ దళాలలో పెద్ద సంఖ్యలో ఈ రాష్ట్ర యువత పనిచేస్తుండటం ఇందుకు నిదర్శనమని శ్రీ మోదీ ప్రశంసించారు. అయితే, ఒకే ర్యాంకు–ఒకే పెన్షన్ (ఓఆర్‌ఓపి) పథకం అమలులో గత ప్రభుత్వం దశాబ్దాల పాటు మోసపూరితంగా వ్యవహరించిందని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక మాత్రమే ఈ పథకంపై సిబ్బంది ఆకాంక్షలను నెరవేర్చామని గుర్తుచేశారు. దీనికింద హర్యానాలోని మాజీ సైనికులకు రూ.13,500 కోట్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. కాగా, గత ప్రభుత్వం ఈ పథకానికి కేవలం రూ.500 కోట్లు కేటాయించి సైనికులను తప్పుదోవ పట్టించిందని పేర్కొన్నారు. అలాగే దళితులు, వెనుకబడిన తరగతులు లేదా సైనికులకు ఏనాడూ మద్దతిచ్చింది లేదని ఆయన స్పష్టం చేశారు.

వికసిత భారత్ సంకల్పాన్ని బలోపేతం చేయడంలో హర్యానా పాత్రపై విశ్వాసం వ్యక్తం చేస్తూ– క్రీడలు లేదా వ్యవసాయ రంగాల్లో ప్రపంచంపై ఈ రాష్ట్ర ప్రభావాన్ని ప్రధానమంత్రి ప్రశంసించారు. ఇక్కడి యువత శక్తిసామర్థ్యాలపై తనకుగల అపార విశ్వాసాన్ని ప్రకటించారు. హర్యానా ఆకాంక్షలు నెరవేర్చడంలో కొత్త విమానాశ్రయం, విమానాలు ఉత్ప్రేరకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

అమెరికాకు చైనా మరో షాక్.. బోయింగ్ విమానాల కొనుగోళ్లకు బ్రేక్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:అమెరికా–చైనాల మధ్య టారిఫ్ వార్ రోజుకో మలుపు తిరుగుతోంది. ఇప్పటికే చైనా పలు కీలక ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేయడాన్ని నిలిపివేసింది. ఆ దేశ ఉత్పత్తుల్ని కొనుగోలు చేయడం మానేసింది. తాజాగా అమెరికాలోని విమానాల తయారీ సంస్థ బోయింగ్‌కు చెందిన విమానాల్ని కొనుగోలు చేయొద్దని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆ దేశ విమానయాన సంస్థలకు ఆదేశాలు జారీ చేశారు. బ్లూమ్‌బర్గ్ సైతం ఇదే విషయాన్ని ధృవీకరించింది.

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమెరికా , చైనా మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రమవుతోంది.

ఇప్పటికే అమెరికా, చైనా నుంచి దిగుమతులపై 145 శాతం వరకు టారిఫ్‌లు విధించింది. దీనికి ప్రతిగా చైనా కూడా అమెరికా దిగుమతులపై 125 శాతం కస్టమ్స్ టారిఫ్‌లు విధించింది.

ఈ తరుణంలో చైనా, దేశీయ విమానయాన సంస్థలు బోయింగ్ విమానాలను కొనుగోలు చేయకుండా ఆదేశించినట్టు బ్లూమ్‌బర్గ్ నివేదించింది. అంతేకాకుండా, అమెరికా నుండి విమాన భాగాలు,ఉపకరణాల కొనుగోళ్లను కూడా నిలిపివేయాలని పేర్కొంది. అదే సమయంలో విమానాల లీజు తీసుకునే సంస్థలకు చైనా ప్రభుత్వం ఆర్థికంగా సహాయం చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. బోయింగ్ సంస్థ నుంచి అత్యధిక విమానాలు కొనుగోలు చేసేది చైనానే.. ఇప్పటికే నష్టాలతో ఉన్న బోయింగ్ కంపెనీకి చైనా నిర్ణయంలో మరిన్ని నష్టాలు వస్తాయని అంటున్నారు.. ట్రంప్ త్వరగా నిర్ణయం తీసుకోకుంటే బోయింగ్ మూత పడే ప్రమాదం ఉందని భయపడుతున్నారు.

ఇక ట్రంప్ విధించిన టారిఫ్‌లు ప్రపంచ మార్కెట్లను గందరగోళంలోకి నెట్టేశాయి. మిత్రదేశాలు, ప్రత్యర్థులతో కూడిన సంబంధాలపై ప్రభావం చూపించాయి. గత వారం ట్రంప్, కొత్త టారిఫ్‌లను

తాత్కాలికంగా నిలిపివేశానని ప్రకటించినా, చైనాకు ఎలాంటి మినహాయింపు ఇవ్వలేదు. అమెరికా అధికారులు ఇటీవల స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు,సెమీకండక్టర్లు వంటి హైటెక్ ఉత్పత్తులపై టారిఫ్ మినహాయింపులు ప్రకటించారు.

డీఎస్సీ ద్వారా స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల భర్తీ

అమరావతి, ఏప్రిల్ 15: డీఎస్సీ ద్వారా స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల భర్తీకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో జారీ చేసింది. 2,260 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుల భర్తీకి రెండు వేర్వేరు జీవోలు జారీ చేసింది. 2,260 పోస్టుల్లో 1,136 పోస్టులు ఎస్‌ఓటీలు, 1,124 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి సిట్ నోటీసులు

అమరావతి, ఏప్రిల్ 15: మద్యం కుంభకోణం ఆరోపణల కేసులో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి సిట్ నోటీసులు ఇచ్చింది. ఈనెల 18న విజయవాడ సీపీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని పేర్కొంది. వైసీపీ హయాంలో లిక్కర్ స్కామ్ జరిగిందని కూటమి ప్రభుత్వం ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా దర్యాప్తునకు సిట్‌ను ఏర్పాటు చేసింది.

మదుపర్ల హుషార్ ..ఒక్క రోజే రూ.10 లక్షల కోట్ల లాభం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం ట్రేడింగ్‌ను గణనీయమైన లాభాలతో ముగించాయి. ఉదయం సానుకూలంగా ప్రారంభమైన మార్కెట్లు, రోజంతా అదే ఉత్సాహాన్ని కొనసాగించి భారీ వృద్ధితో స్థిరపడ్డాయి. ఈ ఒక్క రోజే ఏకంగా రూ.10 లక్షల కోట్లు లాభపడ్డారు మదుపరులు.. కాగా ట్రేడింగ్ ముగిసే సమయానికి, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 1,577.63 పాయింట్లు (2.22 శాతం) లాభపడి 76,734.89 పాయింట్ల వద్ద నిలిచింది. అదేవిధంగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా భారీగా పుంజుకుంది. నిఫ్టీ 500.00 పాయింట్లు (2.25 శాతం) పెరిగి 23,328.55 వద్ద ముగిసింది. ఈరోజు ట్రేడింగ్‌లో పలు కంపెనీల షేర్లు లాభాలను ఆర్జించాయి. ముఖ్యంగా ఐమ్కో ఎలెకాన్ (ఇండియా), ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా, ఫినో పేమెంట్స్ బ్యాంక్, పాండీ ఆక్సైడ్స్ అండ్ కెమికల్స్, ఐనాక్స్ గ్రీన్ ఎనర్జీ సర్వీసెస్ షేర్లు టాప్ గెయినర్స్‌గా నిలిచాయి.

అయితే, కొన్ని కంపెనీల షేర్లు నష్టాలను చవిచూశాయి. క్వెస్ కార్ప్, రాజ్ టెలివిజన్ నెట్‌వర్క్, ఉమా ఎక్స్‌పోర్ట్స్, స్ట్రాటెక్ ఫైనాన్స్ లిమిటెడ్ వంటి కంపెనీలు నష్టపోయిన షేర్ల జాబితాలో ఉన్నాయి.

ఎస్సీ వర్గీకరణ ముసాయిదాకు చంద్రబాబు కేబినెట్ ఓకే

అమరావతి, ఏప్రిల్ 15: ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్కుఏపి మంత్రి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.617 కోట్లతో అసెంబ్లీ, రూ.786 కోట్లతో హైకోర్టు భవన నిర్మాణాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నిర్మాణ పనులను ఎల్1 బిడ్డర్కు అప్పగించాలని నిర్ణయించింది. స్టేట్ సెంటర్ ఫర్ క్లైమేట్ ఇన్ సిటీస్ వ్యవస్థల ఏర్పాటును ఆమోదించింది. పట్టణ ప్రాంతాల్లో వరద నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నేడు నిర్వహించిన ఏపీ కేబినెట్ భేటిలో మొత్తం 24 అంశాలపై మంత్రులు చర్చించారు.. వాటిలో కొన్నింటికి ఆమోద ముద్ర లభించగా, మరికొన్నింటిపై మరోసారి చర్చించాలని నిర్ణయించారు. జాతీయ ఎస్సీ కమిషన్ నుంచి వచ్చిన ఎస్సీ వర్గీకరణ నివేదికపై మంత్రివర్గంలో కీలక చర్చ జరిపారు. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదికను శాసనసభలో ఆమోదించి జాతీయ ఎస్సీ కమిషన్కు రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. జాతీయ ఎస్సీ కమిషన్ పరిశీలన తర్వాత తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక వచ్చింది. దీనిని సూత్రప్రాయంగా ఆమోదించింది కేబినేట్. ఇక దీనిపై ఆర్డినెన్స్ జారీ చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

అలాగే మంత్రి వర్గం సీఆర్డీఏ 46 ఆథారిటీ నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. అసెంబ్లీ, హైకోర్టు శాశ్వత భవనాల టెండర్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎల్వన్గా నిలిచిన సంస్థలకు లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్ ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ. 617 కోట్లతో అసెంబ్లీ బేస్ మెంట్ + జీ + 3 + వ్యూయింగ్ ప్లాట్ ఫాంలు + పనోరమిక్ వ్యూ (బిల్టప్ ఏరియా 11.22 లక్షల చదరపు అడుగులు,ఎత్తు 250 మీటర్లు) అసెంబ్లీ నిర్మాణానికి టెండర్లలో ఎల్వన్గా నిలిచిన సంస్థకు ఎల్ఓఏ (ఓఎం) ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది.. రూ.786 కోట్లతో హైకోర్టు బేస్ మెంట్ + జీ + 7 అంతస్తుల్లో నిర్మాణం, బిల్టప్ ఏరియా 20.32 లక్షల చదరపు అడుగులు ఎత్తు 55 మీటర్లు? ఎల్వన్గా నిలిచిన సంస్థకు ఎల్ఓఏ ఇచ్చేందుకు ఓకే చెప్పింది. అలాగే పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) 5వ సమావేశం నిర్ణయాలను ఆమోదించింది. రూ. 30, 667 కోట్ల పెట్టుబడులతో 16 సంస్థల ఏర్పాటుకు ఇటీవల ఎస్ఐపీబీలో నిర్ణయం తీసుకుంది. వీటి ద్వారా 32,133 ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ నిర్ణయానికి జెండా ఊపింది చంద్రబాబు కేబినెట్.

శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, గుంటూరు , చిత్తూరు, కడప, అనంతపురం ఉమ్మడి జిల్లాలో సీనరేజీ ఫీజు వసూలు కాంట్రాక్టు గడువు పెంచే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. విశాఖ ఐటీ హిల్స్లో టీసీఎస్కు 21.66 ఎకరాల భూమిని రూ. 99 పైసలకు లీజు ఇచ్చేందుకు కేబినెట్ సూత్రప్రాయంగా ఓకే అంది. టీసీఎస్ ఏర్పాటు ద్వారా రూ.1370 కోట్ల రూపాయల మేర పెట్టుబడులు రావటంతో పాటు 12 వేల మందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్కు విశాఖ ఐటి హిల్లో 3.5 ఎకరాలు, కాపులుప్పాడలో 56 ఎకరాల కేటాయించేందుకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

స్టేట్ సెంటర్ ఫర్ క్లైమేట్ ఇన్ సిటీస్ వ్యవస్థ ఏర్పాటుపై కేబినెట్ లో చర్చించారు.. 3 జిల్లాల్లో 199 వ్యవసాయ ఫీడర్ల ఏర్పాటుకు సంబంధించిన డీపీఆర్లకు ఆమోదం తెలిపింది. వివిధ ప్రాంతాల్లో సౌర, పవన, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలంలో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుకు 6.35 ఎకరాల భూమి కేటాయించనుంది. కుప్పంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వ భూ మార్పిడికి ఆమోదం తెలిపింది. నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు ఏపీఐఐసీకి భూ కేటాయింపులకు చంద్రబాబు కేబినెట్ ఓకే అంది..

పవన్ కు అస్వస్థత..

ఇవాళ ఉదయం 10.30 గంటల ప్రాంతంలో పవన్ మంత్రివర్గ సమావేశానికి వచ్చారు. అయితే, కేబినెట్ భేటీ ప్రారంభానికి ముందే ఆయన అస్వస్థతకు గురయ్యారు.. ఆయన వెన్ను నొప్పితో బాధపడుతున్నట్లు సమాచారం. దాంతో ఆరోగ్యం సహకరించక సమావేశం ప్రారంభమయ్యేలోపే అక్కడి నుంచి క్యాంపు ఆఫీస్కి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆయన క్యాంపు కార్యాలయంలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు.

మే 2న అమరావతికి రానున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:ప్రధాని మోదీ ఏపి పర్యటన ఖరారైంది.. ఆయన మే రెండో తేదిన అమరావతికి రానున్నారు.. ఈ సందర్బంగా అమరావతి పునర్ నిర్మాణ వనులను ఆయన ప్రారంభించనున్నారు.. ఈ మేరకు ఆయన పర్యటన వివరాలను ప్రధాన మంత్రి కార్యాలయం నేడు విడుదల చేసింది. కాగా అమరావతిలో 41 వేల కోట్ల రూపాయిలతో చేపట్టనున్న నిర్మాణ వనులను ఆయన లాంచనంగా ఆరంభించనున్నారు.. ఇప్పటికే ఈ నిర్మాణ పనులకు టెండర్లను కూడా ఏపి ప్రభుత్వ ఖరారు చేసింది. అలాగే ఈ పునర్ నిర్మాణ పనులకు కేంద్రం 15 వేల కోట్ల రూపాయిలు ప్రపంచ బ్యాంక్ నుంచి రుణం ఇచ్చింది. అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా తన వాటాగా మరో 3వ వేల కోట్ల రూపాయిలను రిలీజ్ కూడా చేసింది. దీంతో దశలో వారీగా నిర్మాణాలను చేపట్టనుంది ఏపి ప్రభుత్వం..

ఇక ఒడ్డునే మర పడవలు.. నేటి నుంచి సముద్రంలో చేపల వేట నిషేధం

విశాఖపట్నం ఏప్రిల్ 15: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చేపల వేటకు ప్రభుత్వం బ్రేక్ ప్రకటించింది. గత అర్ధరాత్రి నుంచి అమలులోకి వచ్చిన ఈ నిషేధం జూన్ 14 అర్ధరాత్రి వరకు 61 రోజుల పాటు కొనసాగనుంది. ఈ సమయంలో సముద్రంలో వేటకు వెళ్లడంపై పూర్తిగా నిషేధం విధించింది. మత్స్య శాఖ ఆదేశాల మేరకు నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

ఇప్పటికే కోస్ట్ గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ, మత్స్య శాఖ అధికారుల ఆధ్వర్యంలో తీరప్రాంతాల్లో గస్తీ బలగాలు ఏర్పాటు చేశారు. డ్రోన్ల ద్వారా సముద్రంపై నిఘా పెంచారు. అనుమతి లేకుండా వేటకు వెళ్లే బోటులను సీజ్ చేస్తామని.. సంబంధిత మత్స్యకారులపై కేసులు నమోదు చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఈ నిషేధం ప్రధానంగా మెకనైజ్డ్ బోట్లు, మోటార్ బోట్లపై వర్తిస్తుంది.

తడ (తిరుపతి జిల్లా) నుంచి ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా) వరకు 1,027 కిలోమీటర్ల మేర విస్తరించిన ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలో, సుమారు 65 మండలాల్లోని 555 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ సుమారు 8.5 లక్షల మంది మత్స్యకారులు జీవిస్తుండగా.. వారిలో 1.63 లక్షల మంది సముద్ర వేటపై ఆధారపడి తమ కుటుంబాలను పోషిస్తున్నారు. కేవలం కాకినాడ జిల్లాలోనే 24,500 మత్స్యకార కుటుంబాలు నివసిస్తున్నాయి. అక్కడ 483 మెకనైజ్డ్ బోట్లు, 3,800 మోటార్ బోట్లు వాడుతుండగా.. ఇప్పుడు ఈ వాహనాలపై వేట నిషేధం అమల్లో ఉండనుంది.

మత్స్య సంపదను సంరక్షించేందుకు చేపల వేటకు ప్రతి ఏటా ప్రభుత్వం నిషేధం విధిస్తుంది. ఈ కాలంలో చేపలు, ఇతర జలచరాల తరం మారే కాలం కావడంతో, వాటి వృద్ధిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటుంది. ఈ తరహాగా చర్యలు చేపట్టడం ఇది సముద్ర జీవవైవిధ్యాన్ని కాపాడటంలో కీలకమైన పాత్ర పోషిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వేట నిషేధాన్ని కఠినంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు సైతం చేపట్టింది.

కాకినాడ జిల్లాలోని 419 సాంప్రదాయ బోట్లకు మాత్రమే వేట నుంచి ఈ మినహాయింపు వర్తిస్తుంది. అయినప్పటికీ వీటిని వినియోగించేటప్పుడు కూడా ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల మేరకు వ్యవహరించాల్సి ఉంటుంది. మరోవైపు వేటపై నిషేదం కారణంగా మత్స్యకారులు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక సహాయ పథకాలను అందిస్తోంది. వీటిలో ఇన్పుట్ సబ్సిడీలు, నిత్యావసర సరుకుల పంపిణీ, ఇతర ఆర్థిక ప్యాకేజీలు అందిస్తుంది.

అంతే కాకుండా మత్స్యకారుల్లో నిషేధంపై అవగాహన పెంచేందుకు పలు ప్రచార కార్యక్రమాలు చేపడుతోంది. గ్రామాల్లో సమావేశాలు నిర్వహణ, ఫ్లెక్సీలు ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. వేల నిషేధ కాలంలో ప్రతి కుటుంబానికి రూ .15 వేలు ఆర్థిక సాయం అందించనుంది.

శిశు, బాలింత మరణాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోండి-ఆహార కమిషన్ చైర్మన్ గోలి

నల్లగొండ , ఏప్రిల్ 15: రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో సభ్యులు శారద, భారతి, జ్యోతి సభ్యులతో కూడిన బృందం మంగళవారం నల్లగొండ జిల్లాలో పర్యటించింది. కొండమల్లేపల్లి, దేవరకొండ మండలాలలో పర్యటించిన కమిషన్ చైర్మన్ కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని రేషన్ దుకాణం, ధోనియాల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని, కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, దేవరకొండ బీసీ బాలుర వసతి గృహాన్ని, సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని, కొండ భీమనపల్లి సమీపంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలను, ప్రభుత్వ ఆసుపత్రి ని కమిషన్ బృందం సందర్శించింది.

పౌష్టికాహారం అందుతుందా..

ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం అర్హులకు అందుతుందా లేదా అని సభ్యులు లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. శిశు, బాలింత మరణాలు లేకుండా జాగ్రత్త వహించాలని, విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందేలా చూడాలని ఆదేశించారు. అంగన్వాడి కేంద్రాలకు సరఫరా అవుతున్న పాల ప్యాకెట్లు పెద్దవిగా ఉండడం వల్ల వృథా ఎక్కువ అవుతుందని తక్కువ మోతాదులో ఉండే పాల ప్యాకెట్లను అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేయాలని ప్రభుత్వానికి సూచిస్తామని కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు.

రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం సరఫరా తీరు ఎలా ఉందని లబ్ధిదారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులతో మాట్లాడారు. రోగుల సౌకర్యార్థం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ శేఖర్ రెడ్డి, దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, డీటీడీఓ ఛత్రు నాయక్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

హర్యానా రైతుల సామర్థ్యాన్ని పెంచడమే మా ప్రయత్నం:ప్రధాని

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు హర్యానాలోని యమునా నగర్లో పలు అభివృద్ధి పథకాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా హర్యానా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పవిత్ర భూమి హర్యానాకు ప్రధానమంత్రి నివాళులు అర్పించారు. ఇది సరస్వతీ మాత జన్మస్థలం, మంత్రాదేవి నివాసం, పంచముఖి హనుమాన్ జీ స్థానం, అలాగే పవిత్ర కపాలమోచన్ సాహిబ్ ఉన్న ప్రదేశంగా పేర్కొంటూ, "హర్యానా సంస్కృతి, భక్తి అంకితభావ సంగమం" అని ఆయన వర్ణించారు. ఈరోజు బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలను తెలియజేశారు. బాబాసాహెబ్ దార్శనికత, ప్రేరణ ఇప్పటికీ భారతదేశ అభివృద్ధి ప్రయాణానికి మార్గనిర్దేశం చేస్తున్నాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

"యమునానగర్ కేవలం ఒక నగరం మాత్రమే కాదు. ఇది భారత్కు అత్యంత కీలకమైన పరిశ్రమల కేంద్రంగా మారింది. ప్లైవుడ్ నుంచి ఇత్తడి, ఉక్కు పరిశ్రమల వరకు, దేశ ఆర్థిక వ్యవస్థకు విశేషంగా సహకరిస్తోంది" అని శ్రీ మోదీ అన్నారు. అలాగే, ఈ ప్రాంతంలోని సాంస్కృతిక, చారిత్రాత్మక ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ, రుషి వేదవ్యాసుల పవిత్ర భూమి అయిన కపాల మోచన్ మేళా. గురు గోవింద్ సింగ్ జీ ఆయుధాల స్థలం వంటి ప్రదేశాలను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. హర్యానా ఇన్చార్జిగా ఉన్న సమయంలో పంచకులా నుంచి యమునానగర్కు తరచూ వచ్చిన రోజులను గుర్తు చేసుకుంటూ, ఈ నగరంతో తనకు ఉన్న వ్యక్తిగత అనుబంధాన్ని ఆయన పంచుకున్నారు. తనతో కలిసి పనిచేసిన నిబద్ధతతో కూడిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే, ఈ ప్రాంతంలో ఉన్న కష్టించి పని చేయడం, నిబద్ధత సంప్రదాయాన్ని ప్రశంసించారు.

వరుసగా మూడోసారి అధికారం చేపట్టిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో హర్యానా అభివృద్ధిలో రెట్టింపు వేగాన్ని సాధిస్తోందని ప్రధానమంత్రి తెలిపారు. అభివృద్ధి చెందిన భారత్ దార్శనికతలో హర్యానా అభివృద్ధి కూడా భాగమని స్పష్టం చేశారు. మరింత వేగంతోనూ, ఎక్కువ స్థాయి లోనూ పనిచేయడం ద్వారా హర్యానా ప్రజలకు సేవ చేయడానికి, యువత ఆకాంక్షలను నెరవేర్చడానికి ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో ఉందని ఆయన తెలిపారు. ఈరోజు ప్రారంభించిన అభివృద్ధి ప్రాజెక్టులు ఈ నిబద్ధతకు నిదర్శనమని ప్రధాని పేర్కొన్నారు. ఈ కొత్త అభివృద్ధి కార్యక్రమాల సందర్భంగా హర్యానా ప్రజలకు హార్దిక అభినందనలు తెలియజేశారు.

బాబాసాహెబ్ అంబేద్కర్ దార్శనికతను ముందుకు తీసుకెళ్లడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేస్తూ, సామాజిక న్యాయానికి పరిశ్రమల అభివృద్ధి ఒక మార్గమని బాబాసాహెబ్ నమ్మేవారని ఆయన పేర్కొన్నారు. భారతదేశంలో చిన్న కమతాల సమస్యను బాబాసాహెబ్ గుర్తించారని చెబుతూ, వ్యవసాయ భూమి తక్కువగా ఉన్న దళితులకు పరిశ్రమల అభివృద్ధి ద్వారా అత్యధిక లాభం చేకూరుతుందని ఆయన అన్నారు. పరిశ్రమలు దళితులకు ఎక్కువ ఉద్యోగ అవకాశాలు కల్పించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయనే బాబాసాహెబ్ దృష్టిని ప్రధాని పంచుకున్నారు. అలాగే, భారతదేశ పారిశ్రామిక అభివృద్ధిలో బాబాసాహెబ్ పాత్రను ఆయన గుర్తు చేశారు. ఈ దిశగా దేశపు తొలి పరిశ్రమల మంత్రిగా ఉన్న డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీతో కలిసి బాబాసాహెబ్ పనిచేసిన విధానాన్ని ఆయన గుర్తు చేశారు.

పారిశ్రామికీకరణ, తయారీ రంగాల మధ్య సమన్వయాన్ని గ్రామీణ సౌభాగ్యానికి పునాదిగా దీనబంధు చౌదరి ఛోటు రామ్ జీ కూడా గుర్తించిన విషయాన్ని ప్రధాని ప్రస్తావించారు. వ్యవసాయంతో పాటు చిన్నచిన్న పరిశ్రమల ద్వారా రైతులు తమ ఆదాయాన్ని పెంచినప్పుడే గ్రామాల్లో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఛోటూ రామ్ జీ విశ్వసించారని ఆయన పేర్కన్నారు. గ్రామాలు రైతుల సంక్షేమానికి తన జీవితాన్ని అంకితం చేసిన చౌధరి చరణ్ సింగ్ జీ కూడా ఇదే దృష్టిని కలిగి ఉన్నారని ప్రధాని పేర్కొన్నారు. పారిశ్రామిక అభివృద్ధి వ్యవసాయానికి తోడ్పాటుగా ఉండాలని, ఎందుకంటే ఈ రెండూ ఆర్థికవ్యవస్థకు మూలస్తంభాలని చరణ్ సింగ్ నమ్మారని ఆయన వివరించారు.

మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ సారాంశం తయారీ రంగాన్ని ప్రోత్సహించడంలోనే ఉందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఈ ఏడాది బడ్జెట్లో ప్రకటించిన 'మిషన్ మాన్యుఫ్యాక్చరింగ్' ద్వారా ప్రభుత్వం తయారీ రంగంపై పెట్టిన దృష్టిని ఆయన ప్రత్యేకంగా వివరించారు. దళిత, వెనుకబడిన, అణగారిన, అట్టడుగు వర్గాల యువతకు గరిష్ట ఉపాధి అవకాశాలను సృష్టించడం, వారికి అవసరమైన శిక్షణను అందించడం, వ్యాపార ఖర్చులను తగ్గించడం, ఎంఎస్ఎంఈ రంగాన్ని బలోపేతం చేయడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిశ్రమలను సన్నద్ధం చేయడం, భారతీయ ఉత్పత్తులు ప్రపంచ స్థాయికి తగ్గట్టు నాణ్యతగా ఉండేలా చూడటం ఈ మిషన్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

ఈ లక్ష్యాలను సాధించడానికి నిరంతర విద్యుత్ సరఫరా ప్రాముఖ్యతను, నేటి ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ, యమునానగర్, హర్యానాకు ప్రయోజనం చేకూర్చే దీన్ బంధ్ చౌదరి ఛోటు రామ్ థర్మల్ పవర్ ప్లాంట్ మూడో యూనిట్ పనులను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. యమునానగర్ భారతదేశ ప్లైవుడ్ అవసరాల్లో సగభాగాన్ని ఉత్పత్తి చేస్తుందని, అల్యూమినియం, రాగి, ఇత్తడి పాత్రల తయారీకి కేంద్రంగా ఉందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. యమునానగర్ నుంచి పెట్రో కెమికల్ ప్లాంట్ పరికరాలు పలు దేశాలకు ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తిని పెంచడం వల్ల ఈ పరిశ్రమలకు ప్రయోజనం కలుగుతుందని, మిషన్ మాన్యుఫ్యాక్చరింగ్ కు తోడ్పడుతుందని ఆయన ఉద్ఘాటించారు.

భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో విద్యుత్ పాత్ర కీలకమని చెబుతూ, వన్ నేషన్-వన్ గ్రిడ్, కొత్త బొగ్గు విద్యుత్ ప్లాంట్లు, సౌర శక్తి ప్రాజెక్టులు, అణు రంగం విస్తరణ వంటి కార్యక్రమాలతో సహా విద్యుత్ లభ్యతను పెంచడానికి ప్రభుత్వం చేస్తున్న బహుముఖ ప్రయత్నాలను ప్రధానమంత్రి వివరించారు. దేశ నిర్మాణ కార్యక్రమాల్లో విద్యుత్ కొరత అడ్డంకి కాకూడదంటే విద్యుత్ ఉత్పత్తిని పెంచడం చాలా అవసరమని, 2014కు ముందు గత ప్రభుత్వ హయాంలో, తరచూ కరెంటు ఆగిపోయేదని, కాంగ్రెస్ అధికారంలో ఉండి ఉంటే ఇంకా ఇలాంటి సంక్షోభాలు కొనసాగేవని ఆయన అన్నారు. ఆ కాలంలో కర్మాగారాలు, రైల్వేలు, నీటి పారుదల వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంలో భారత్ తన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని దాదాపు రెట్టింపు చేసిందని, ఇప్పుడు పొరుగు దేశాలకు విద్యుత్ ను ఎగుమతి చేస్తోందని అన్నారు. హర్యానాలో విద్యుత్ ఉత్పత్తిపై తమ ప్రభుత్వం పెట్టిన దృష్టి వల్ల వచ్చిన ప్రయోజనాలను ప్రధాని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రం 16,000 మెగావాట్ల విద్యుత్ను ఉత్పత్తి చేస్తోందని చెప్పారు. రాబోయే సంవత్సరాల్లో ఈ సామర్థ్యాన్ని 24,000 మెగావాట్లకు పెంచడమే లక్ష్యమని కూడా ఆయన ప్రకటించారు.

థర్మల్ విద్యుత్ ప్లాంట్లలో పెట్టుబడి పెట్టడమే కాకుండా, ప్రజలే స్వయంగా విద్యుత్ ఉత్పత్తిదారులుగా మారేలా చేసే ద్వంద్వ దృష్టిని ప్రభుత్వం అవలంబించిందని ప్రధానమంత్రి తెలిపారు. ఇందుకోసం పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన ప్రారంభించామని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రజలు తమ ఇళ్లపై సౌర ప్యానెళ్లను ఏర్పాటు చేసుకుని, విద్యుత్ బిల్లులు లేకుండా చూసుకోవచ్చని, అంతేకాక మిగతా విద్యుత్ను విక్రయించి ఆదాయాన్ని ఆర్జించవచ్చని ఆయన వివరించారు.

దేశవ్యాప్తంగా 1.25 కోట్ల మంది ఈ పథకం కింద నమోదు చేసుకున్నారని, హర్యానా నుంచి లక్షలాది మంది ఈ పథకంలో చేరడానికి దరఖాస్తు చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం విస్తరణతో ఏర్పడుతున్న సేవల వ్యవస్థ మరింతగా అభివృద్ధి చెందుతోందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. సౌర విద్యుత్ రంగం కొత్త నైపుణ్యాలను సృష్టిస్తోందని, ఎంఎస్ఎంఈలకు అవకాశాలను అందిస్తోందని, యువతకు అనేక ఉద్యోగ అవకాశాలకు తలుపులు తెరుస్తోందని ఆయన తెలిపారు.

చిన్న పట్టణాల్లోని చిన్న పరిశ్రమలకు సరిపడా విద్యుత్, ఆర్థిక వనరులను సమకూర్చడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని ప్రధాన మంత్రి చెప్పారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో ఎంఎస్ఎంఈలను ఆదుకునేందుకు ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించిందన్నారు. చిన్న పరిశ్రమలు పెరిగే కొద్దీ ప్రభుత్వ మద్దతును కోల్పోతాయనే భయం లేకుండా విస్తరించడానికి వీలుగా ఎంఎస్ఎంఈల నిర్వచనాన్ని సవరించామని, ఈ దిశగా చిన్న పరిశ్రమలకు ప్రత్యేక క్రెడిట్ కార్డులను ప్రవేశపెట్టడంతో పాటు క్రెడిట్ గ్యారంటీ పరిధిని పెంచామని పేర్కొన్నారు.

ముద్రా యోజన 10 సంవత్సరాల మైలురాయిని అధిగమించిందని, దీని కింద రూ .33 లక్షల కోట్ల పూచీకత్తు లేని రుణాలను పంపిణీ చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం లబ్ధిదారుల్లో 50 శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కుటుంబాలకు చెందిన వారేనని స్పష్టం చేశారు. భారత యువత గొప్ప కలల్ని నెరవేర్చేందుకు చిన్నచిన్న పరిశ్రమలు కూడా కీలక పాత్ర పోషించాలి అనే దిశగా ప్రభుత్వం నిబద్ధతతో ఉన్నదని ప్రధాని తెలిపారు.

ప్రతి భారతీయునికి ఆహారం అందించే హర్యానా రైతుల కృషిని ప్రధానమంత్రి, ప్రశంసించారు. రైతుల సంతోషాలు, సవాళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్థిరమైన భాగస్వాములుగా నిలుస్తాయని స్పష్టం చేశారు. హర్యానా రైతులను శక్తిమంతులుగా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు 24 పంటలను కనీస మద్దతు ధరలకు కొనుగోలు చేస్తోందని పేర్కొన్నారు. పీఎం ఫసల్ బీమా యోజన ద్వారా హర్యానాలో లక్షలాది మంది రైతులు లబ్ధి పొందారని, ఈ పథకం కింద రూ.9,000 కోట్లకు పైగా క్లెయిమ్లు వచ్చాయని తెలిపారు. అలాగే, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా హర్యానా రైతులకు రూ.6,500 కోట్లు పంపిణీ చేశామని, ఇది వారి జీవనోపాధికి, వృద్ధికి మరింత తోడ్పడుతుందని పేర్కొన్నారు.

వలసకాలం నాటి నీటి పన్నును రద్దు చేస్తూ హర్యానా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తావిస్తూ, ఇది కాలువ నీటిపై పన్నులు చెల్లించకుండా రైతులకు ఉపశమనం కలిగించిందని, ఈ పన్ను కింద రూ .130 కోట్లకు పైగా బకాయిలను కూడా మాఫీ చేశారని పేర్కొన్నారు. రైతులు, పశువుల యజమానులకు కొత్త ఆదాయ అవకాశాలను కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషిని ఆయన వివరించారు. ఆవు పేడ, వ్యవసాయ అవశేషాలు, ఇతర సేంద్రియ వ్యర్థాల నుంచి బయోగ్యాస్ ను ఉత్పత్తి చేయడం ద్వారా రైతులు వ్యర్థాలను నిర్వహించడానికి, ఆదాయాన్ని ఆర్జించడానికి వీలు కల్పించే గోబర్ధన్ యోజన గురించి కూడా ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ ఏడాది బడ్జెట్ లో దేశవ్యాప్తంగా 500 గోబర్ధన్ ప్లాంట్లను ఏర్పాటును ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. యమునానగర్ లో నూతన గోబర్ధన్ ప్లాంట్ కు శంకుస్థాపన చేయడం వల్ల నగరపాలక సంస్థకు ఏటా రూ.3 కోట్లు ఆదా అవుతుందని చెప్పారు. గోబర్ధన్ యోజన స్వచ్ఛ భారత్ అభియాన్ కు కూడా దోహదం చేస్తోందని, పరిశుభ్రత, సుస్థిరత లక్ష్యాన్ని మరింత ముందుకు తీసుకువెడుతోందని తెలిపారు.

అయోధ్య ధామ్ కు నేరుగా విమాన సర్వీసులను ప్రారంభించిన హిసార్ లో తాను గతంలో పర్యటించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అభివృద్ధి పథంలో హర్యానా శరవేగంగా పురోగతి సాధిస్తోందని ప్రధాన మంత్రి చెప్పారు. రేవారి పట్టణానికి కొత్త బైపాస్ ను ప్రకటించిన ప్రధానమంత్రి.... ఇది మార్కెట్లు, చౌరస్తాలు, రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్ రద్దీని తగ్గించడంలో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ బైపాస్ ద్వారా వాహనాలు పట్టణాన్ని సాఫీగా దాటి వెళ్లగలవని అన్నారు. నాలుగు లైన్లుగా నిర్మించే ఈ బైపాస్ ఢిల్లీ నుంచి నార్నౌల్కు ప్రయాణ సమయాన్ని ఒక గంట వరకు తగ్గిస్తుందని ఆయన తెలిపారు. ఈ అవకాశంపై ప్రజలను ఆయన అభినందించారు.

రాజకీయాలు తమకు ఒక సేవా మాధ్యమం అని, ప్రజలకు, దేశానికి సేవ చేయడమే తమ మార్గమని తెలియచేస్తూ, "హర్యానాలో స్పష్టంగా కనిపిస్తున్నట్టుగా మా పార్టీ వాగ్దానాలను నెరవేరుస్తుంది" అన్నారు. ఇక్కడ మూడోసారి ఎన్నికైన తరువాత కూడా ప్రభుత్వం తాను ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు సాగుతోందని ఆయన చెప్పారు. ఈ అంశాన్ని విపక్ష పాలిత రాష్ట్రాలతో సరిపోల్చిన ప్రధాని, అక్కడ ప్రజలకు నమ్మకద్రోహం జరుగుతోందని విమర్శించారు. హిమాచల్ ప్రదేశ్లో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను ఆయన ప్రస్తావించారు, అక్కడ అభివృద్ధి సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని అన్నారు. కర్ణాటకలో కూడా ప్రస్తుత ప్రభుత్వ పాలనలో విద్యుత్, పాలు, బస్సు ఛార్జీలు, విత్తనాలు వంటి నిత్యావసరాల ధరలు పెరిగాయని ఆయన ప్రస్తావించారు. సోషల్ మీడియాలో చూస్తున్నట్టుగా కర్ణాటకలో అధికారంలో ఉన్న ప్రభుత్వంపై ప్రజల అసంతృప్తిని ఆయన ప్రస్తావించారు, అవినీతి ఆరోపణలను ప్రస్తావించారు, ముఖ్యమంత్రి సన్నిహితులు కూడా కర్ణాటకను అవినీతిలో నంబర్ వన్ గా అంగీకరించారని వ్యాఖ్యానించారు. తెలంగాణలో ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి అడవులను నరికివేసి ప్రకృతికి, వన్యప్రాణులకు హాని కలిగిస్తోందని విమర్శించారు.

పరిపాలనకు సంబంధించిన రెండు నమూనాలను ఆయన పోల్చారు. తమ పార్టీ నమూనా నిజమైనదని, అభివృద్ధి చెందిన భారత్ కోసం అంకితమైందని, అయితే ప్రతిపక్షాల నమూనా మోసపూరితమని, కేవలం అధికారంపైనే అవి దృష్టి సారించాయని పేర్కొన్నారు. అభివృద్ధి పట్ల తమ పార్టీ నిబద్ధతకు యమునానగర్ లో జరుగుతున్న ప్రయత్నాలే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

వైశాఖీ పండుగ వైశిష్ట్యాన్ని, జలియన్వాలా బాగ్ మారణకాండ 106వ వార్షికోత్సవాన్ని ప్రస్తావిస్తూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన వీరులను ప్రధానమంత్రి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా, బ్రిటిష్ పాలకుల క్రూరత్వాన్ని ఆయన ప్రస్తావిస్తూ, ఆ దురంతం భారత చరిత్రలో ఒక బాధాకర అధ్యాయంగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. జలియన్వాలా బాగ్ ఉదంతంలోని మరొక ముఖ్యమైన కోణాన్ని ప్రధానమంత్రి ప్రస్తావించారు. బ్రిటిష్ ప్రభుత్వంలోని ప్రముఖ న్యాయవాది, ఉన్నతాధికారి అయిన శంకరన్ నాయర్ మానవత్వం కోసం, దేశం కోసం నిలబడి పోరాడడాన్ని అప్రతిహత చైతన్యంగా ప్రధానమంత్రి అభివర్ణించారు.. శంకరన్ నాయర్, ఆ క్రూరత్వాలకు నిరసనగా తన పదవి నుంచి రాజీనామా చేసి, విదేశీ పాలనపై ధీటుగా గొంతెత్తిన విషయాన్ని ఆయన పంచుకున్నారు. జలియన్ వాలాబాగ్ కేసును ఒంటరిగా వాదించి బ్రిటిష్ సామ్రాజ్య పునాదులను కదిలించి, కోర్టులో జవాబుదారీగా నిలిచారని, కేరళకు చెందిన ఒక వ్యక్తి పంజాబ్ లో మారణకాండకు, బ్రిటిష్ అధికారానికి వ్యతిరేకంగా ఎలా నిలబడ్డాడో చూపించే శంకరన్ నాయర్ సాహసం "ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్"కు ఒక అద్భుతమైన ఉదాహరణగా ప్రధాని అభివర్ణించారు. ఈ ఐక్యత, ప్రతిఘటన స్ఫూర్తి భారత స్వాతంత్ర్య పోరాటం వెనుక నిజమైన ప్రేరణ అని, అభివృద్ధి చెందిన భారతదేశం దిశగా ప్రయాణంలో చోదక శక్తిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

శంకరన్ నాయర్ రచనల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ప్రధానమంత్రి సూచించారు. సమాజానికి మూలస్తంభాలైన పేదలు, రైతులు, యువత, మహిళల సాధికారత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ నిరంతర కృషి కొనసాగిస్తాయని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. సమిష్టి కృషి హర్యానాను అభివృద్ధి పథంలో నడిపిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

హర్యానా ముఖ్యమంత్రి శ్రీ నయాబ్ సింగ్ సైనీ, కేంద్రమంత్రులు శ్రీ మనోహర్ లాల్, శ్రీ రావు ఇందర్ జిత్ సింగ్, శ్రీ క్రిషన్ పాల్ గుర్జార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ ప్రాంతంలో విద్యుత్ మౌలిక వసతులను అభివృద్ధి చేయడంతో పాటు, చివరి స్థానం వరకు విద్యుత్ చేరాలన్న దృష్టితో యమునానగర్లో దీన్ బంధు ఛోటూ రామ్ థర్మల్ విద్యుత్ కేంద్రంలో 800 మెగావాట్ల ఆధునిక యూనిట్కు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. సుమారు రూ. 8,470 కోట్ల వ్యయంతో, 233 ఎకరాల్లో నిర్మించే ఈ యూనిట్ హర్యానా రాష్ట్రం విద్యుత్ స్వయం సమృద్ధిని గణనీయంగా పెంచి, రాష్ట్రవ్యాప్తంగా నిరంతర విద్యుత్ సరఫరా అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

గోబర్ధన్ (గాల్వనైజింగ్ ఆర్గానిక్ బయో- ఆగ్రో రిసోర్సెస్ ధన్) దార్శనికతను ముందుకు తీసుకెళ్తూ, యమునానగర్లోని ముఖరాబ్పూర్లో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్కు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 2,600 మెట్రిక్ టన్నులు. సమర్థవంతమైన సేంద్రీయ వ్యర్థాల నిర్వహణకు ఇది సహాయపడుతుంది, అదే సమయంలో స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తికి, పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుంది.

భారత్ మాల పరియోజన కింద సుమారు రూ.1,070 కోట్ల విలువైన 14.4 కిలోమీటర్ల రేవారీ బైపాస్ ప్రాజెక్టును కూడా ప్రధానమంత్రి ప్రారంభించారు. ఇది రేవారీ నగరంలో రద్దీని తగ్గిస్తుంది, ఢిల్లీ-నార్నౌల్ ప్రయాణ సమయాన్ని ఒక గంట తగ్గిస్తుంది. ఈ ప్రాంతంలో ఆర్థిక, సామాజిక కార్యకలాపాలను పెంచుతుంది.

ఏసిబికి చిక్కిన బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్

అమరావతి, ఏప్రిల్ 15:హైదరాబాద్లో జీహెచ్ఎంసీ అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఓ బాధితుడు ఫిర్యాదు మేరకు మంగళవారం మధ్యాహ్నం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. జోన్ కార్యాలయంలోని అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ విప్పర్ల శ్రీనివాస్ ఫిర్యాదు దారుడి నుంచి రూ.2,20,000 లంచం డిమాండ్ చేయగా.. రూ.70,000 తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు.

చాంద్రాయణ గుట్ట సర్కిల్ పనికి సంబంధించి ఓ కాంట్రాక్టర్ వద్ద లంచం డిమాండ్ చేశాడు. మొక్కల పదార్థాల సరఫరాకు చెక్ మెజర్డ్ బిల్లులను క్లియర్ చేసేందుకు శ్రీనివాస్ లంచం డిమాండ్ చేశాడు. బాధితుడిని లంచం డబ్బులు తీసుకుని శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయానికి రావాలని సూచించాడు. దీంతో కాంట్రాక్టర్ అర్బన్ బయోడైవర్సిటి డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపిన విధంగా శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలోని శ్రీనివాస్ వద్దకు వచ్చాడు. అతని వద్ద నుండి డబ్బులు తీసుకుంటూ శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో శ్రీనివాస్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.

మోసగించడంలో రేవంత్ రెడ్డి నెంబర్ వన్.. ఎర్రబెల్లి దయాకర్ రావు

వరంగల్, ఏప్రిల్ 15: ప్రజలను మోసగించడంలో దేశంలోనే సీఎం రేవంత్ రెడ్డి నెంబర్ వన్ గా నిలుస్తారని, పాలనలో మాత్రం చివరి స్థానంలో ఉంటాడని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఎద్దేవా చేశారు. ఈనెల 27న వరంగల్లో నిర్వహించే బిఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల శివారులోని శ్రీనివాస గార్డెన్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ? సీఎం రేవంత్ రెడ్డి బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, ఏ ఒక్క హామీని ఆయన నెరవేర్చలేదన్నారు. రైతుబంధు ఇవ్వలేదని, రుణమాఫీ చేయలేదని, 420హామీలు ఇచ్చి ఏ ఒక్క హామీ నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. బ్రోకర్ మాటలు మాట్లాడడం రేవంత్ రెడ్డికి మొదటి నుంచి అలవాటేనన్నారు. గతంలో టీడీపీలో ఉన్నప్పుడు ఈ విధంగానే బ్రోకర్ మాటలు మాట్లాడితే మందలించానని గుర్తు చేశారు.

సీఎం అయినా ఆయన తీరులో మార్పు రాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టడం లేదని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలోనే జరిగిన పనులు మాత్రమే రాష్ట్రంలో కనిపిస్తున్నాయన్నారు. నా హయాంలో రూ.100 కోట్లతో మంజూరు చేసిన నిధులు వేరే జిల్లాలకు మళ్ళించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరిగిందని, ఓడిపోతామనే భయంతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతుందన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే బీఆర్ఎస్ ప్రతి గ్రామంలో గులాబీ జెండా ఎగురవేస్తుందన్నారు. ఇప్పుడు ఎన్నికలు పెడితే 100 సీట్లు గెలుస్తామన్నారు. ఏ ఎన్నిక వచ్చినా గెలుపు బీఆర్ఎస్ పార్టీ దేనిని, గెలవకుంటే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానన్నారు. బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ నాయకత్వంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని 25 సంవత్సరాలు పూర్తి చేసుకుందని తెలిపారు. అనేక పోరాటాలతో తెలంగాణ రాష్ట్రం సాధించి అనేక రంగాల్లో రాష్ట్రాన్ని ముందు నిలిపిన కేసీఆర్ పాలన మళ్లీ రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఈనెల 27న జరిగే రజతోత్సవ సభతో దేశ మొత్తం తెలంగాణ వైపు చూస్తుందని, ఈ సభకు నియోజకవర్గ వ్యాప్తంగా 50వేలకు తగ్గకుండా తరలిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మాజీ ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, మాజీ జీపీసీ చైర్మన్ ధరావత్ గాంధీ నాయక్, పట్టణ అధ్యక్షుడు బిందు శ్రీనివాస్, నాయకులు చామకూరి ఐలయ్య, నల్ల మాస ప్రమోద్, కుర్ర శ్రీనివాస్, ప్రదీప్ రెడ్డి, అంకూస్, కాలు నాయక్, ఎన్నమనేని శ్రీనివాసరావు, కర్నే నాగరాజు, మెకానిక్ రాజు, బాలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అనుకూలమైన బీమా ఆఫర్‌లతో పునర్నిర్వచించిన జెన్ఎస్ లైఫ్

హైదరాబాద్, ఏప్రిల్ 15:మీ 60 ప్లస్ జీవితానికి అనువైన యాప్ అయిన జెన్ఎస్ లైఫ్. భారతదేశ సీనియర్ సిటిజన్ల నిర్దిష్ట అవసరాలను తీర్చడానికి, వారి స్వర్ణ సంవత్సరాల్లో ఆర్థిక భద్రత, మనశ్శాంతిని అందించడానికి రూపొందించబడిన దాని ప్రత్యేకమైన బీమా ఆఫర్‌లను ప్రారంభించినట్లు ప్రకటించింది. జెన్ఎస్ ఎక్స్ టి వై ట్రైబ్ ద్వారా అభివృద్ధి చేయబడిన జెన్ఎస్ లైఫ్. 60 ప్లస్ సంవత్సరాల వయస్సు వారు జీవితాన్ని పూర్తిగా జీవించడానికి సాధికారత కల్పించడానికి అంకితమైన ఒక శక్తివంతమైన, సాంకేతికతతో కూడిన వేదిక. వృద్ధాప్యం చుట్టూ ఉన్న సాంప్రదాయ కథనాలను సవాలు చేసే లక్ష్యంతో, జెన్ఎస్ లైఫ్ 60కి పైగా సంవత్సరాల వయస్సును కొత్తగా కనుగొన్న స్వేచ్ఛ, పెరుగుదల, అవకాశాల సమయంగా జరుపుకునే ఒక ఉద్యమాన్ని ఊహించింది.

ఈ వేదిక వృద్ధులు ఎదుర్కొంటున్న సామాజిక-వ్యక్తిగత సవాళ్లైన ఒంటరితనం, కళంకం, ప్రభావాన్ని కోల్పోవడం వంటి వాటిని సమాజం, ఉద్దేశ్యం, సమగ్ర శ్రేయస్సును పెంపొందించడం ద్వారా పరిష్కరిస్తుంది. జెన్స్ లైఫ్ అనేది కేవలం ఒక యాప్ కంటే ఎక్కువ, ఇది భారతదేశంలో వృద్ధాప్యాన్ని పునర్నిర్వచించటానికి ఒక ఉద్యమం అని జెన్స్ లైఫ్ వ్యవస్థాపకురాలు మీనాక్షి మీనన్ అన్నారు. ఆమె ఇంకా 60 ప్లస్ అనేది మీ స్వంత నిబంధనల ప్రకారం జీవితాన్ని గడపడానికి ఒక సమయమని తాము విశ్వసిస్తున్నామన్నారు.

ఇందిరమ్మ లబ్ధిదారులకు రేవంత్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ

హైదరాబాద్, ఏప్రిల్ 15: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసింది. మొదటి దఫాలో రూ.లక్ష చెక్కులను పంపిణీ చేసింది. నోవాటెల్ హోటల్‌లో నేడు జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు అందించారు. అందులో రంగారెడ్డి, సూర్యాపేట, ఖమ్మం, వికారాబాద్, మహబూబ్ నగర్, సిద్దిపేట జిల్లాల వాసులు ఉన్నారు. ఇందిరమ్మ ఇల్లులో మొట్టమొదటి బిల్లును దేవరకద్రకు చెందిన తెలుగు లక్ష్మి, మరికొందరు లక్ష రూపాయల చెక్కును అందుకున్నారు. మొదటి దఫాలో బేస్‌మెంట్ పూర్తయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయలు అందించింది. మొత్తం నాలుగు దఫాల్లో 5 లక్షల రూపాయలు ప్రభుత్వం లబ్ధిదారులకు ఇవ్వనుంది.

రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

మొదటి విడతలో భాగంగా జనవరి 26న 71 వేల మందికి ప్రభుత్వం ఇండ్ల మంజూరు పత్రాలు ఇచ్చింది. రీ వెరిఫికేషన్ లో 6 వేల మందిని అధికారులు అనర్హులుగా తేల్చి తొలగించారు. చివరికి 65 వేల మందిని అర్హులుగా గుర్తించారు. వీరిలో ఇప్పటి వరకు దాదాపు 12 వేల మంది ఇండ్ల నిర్మాణానికి ముగ్గు పోశారు.

మొదటి విడతలో మండలంలోని ఒక గ్రామాన్ని మాత్రమే ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పట్నుంచి అన్ని గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రాథమికంగా ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ.. వాటిని రీ వెరిఫికేషన్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. లబ్ధిదారుల వివరాలను గ్రామ సభల్లో వెల్లడించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

నిత్యవసర సరుకులను పంపిణీ చేసిన పెద్దగోపతి విచారణ కర్తలు

ఖమ్మం, ఏప్రిల్ 15 (నేటినిజం ప్రతినిధి) : కొనిజర్ల మండలం పెద్దమునగాల గ్రామం నందు మంగళవారం మదర్ థెరిస్సా సేవాసమితి కమిటీ ఆధ్వర్యంలో లింగాల జీవమ్మ కుటుంబానికి, తలారి భాగ్యమ్మ కుటుంబానికి బియ్యం, నిత్యవసర సరుకులు, పండ్లు-ఫలాలను ముఖ్య అతిథిగా పెద్దగోపతి విచారణ కర్తలు కిన్నెర రమేష్, అబ్రహం పంతులు చేతులు మీదుగా పంపిణీ చేయడం జరిగింది. అనంతరం ఇటీవల మరణించిన కందుల ప్రవీణ్ సతీమణి కందుల నందిని కొంత ఆర్థిక సహాయం చేయడం జరిగింది. కిన్నెర రమేష్ మాట్లాడుతూ...మానవునికి చేసిన సేవ దేవునికి చేసిన సేవగా భావించి ఆర్థికంగా సహాయం చేసిన ప్రతి ఒక్కరికి ఆ దేవుని దీవెనలు మెండుగా ఉంటాయని అన్నారు. అలాగే ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని, ఒక్క ఊరి కే పరిమితం కాకుండా ఊరు-ఊరు, వాడ-వాడ విస్తరించేలా ప్రతి ఒక్కరు కూడా ఆర్థికంగాను, వస్తు రూపంలో సహాయం అందించినట్లయితే వారికి ముప్పదంత లుగా, అరువదంతలుగా, నూరంతలుగా దేవుని దీవెనలు ఉంటాయన్నారు. మా సేవా సమితి ద్వారా ప్రతి నెల కూడా కలసికట్టుగా చేయి-చేయి కలిపి పేదవారికి, అనారోగ్యం తో బాధపడే వారికి మా వంతు చేయూతను ఇచ్చే విధంగా ముందస్తు ప్రణాళికతో ఉన్నామని సేవాసమితి కమిటీ సభ్యులు తెలియజేశారు. అలాగే ఇంతటి మహత్తర కార్యక్రమం జరగటానికి కారణమైన దాతలకు, సహకరించిన ప్రతి ఒక్కరికి కూడా కమిటీ తరపున పేరుపేరున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిస్సా సేవా సమితి కమిటీ సభ్యులు, పిల్లలు, పెద్దలు, లూర్దుమాత కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ వాయు కాలుష్యంతో ప్రమాదం- డా.బొప్పన సాయి మాధురి

అమరావతి, ఏప్రిల్ 15: ఇండోర్ వాయు కాలుష్యంతో పాటు ప్రమాదం పొంచి ఉందని విజయవాడ హెచ్‌సిజి క్యాన్సర్ సెంటర్, మెడికల్ ఆంకాలజిస్ట్, కన్సల్టెంట్ డా. బొప్పన సాయి మాధురి అన్నారు. ఆమె మాట్లాడుతూ? మనం మన దైనందిన జీవితాలలో, ఇంటి లోపల పీల్చే గాలి నాణ్యతను సులభంగా విన్మరిస్తుంటాము. కానీ వాస్తవమేమిటంటే, ఇండోర్ గాలి నాణ్యత మన మొత్తం ఆరోగ్యంపై, ముఖ్యంగా క్యాన్సర్ ప్రమాదం దగ్గరకు వస్తే తీవ్రమైన ప్రభావమే చూపుతుందన్నారు. ఇండోర్ వాయు కాలుష్యం అనేది ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిని ప్రభావితం చేసే ఒక విస్తృతమైన సమస్య అన్నారు. మన ఇళ్ళు, కార్యాలయాలు, ఇతర భవనాల లోపల గాలి బయటి గాలి కంటే ఐదు రెట్లు ఎక్కువ కలుషితం కావచ్చన్నారు. అస్థిర సేంద్రీయ సమ్మేళనాలు (విఓసీ లు), కణ పదార్థం (పీఎం) రాడాన్ వంటి వివిధ కాలుష్య కారకాలు దీనికి కారణమన్నారు.

ఈ కాలుష్య కారకాలు భవన నిర్మాణ వస్తువులు, ఫర్నిచర్, ఇంటిని శుభ్రపరిచే ఉత్పత్తులు, వేడి వ్యవస్థలతో సహా అనేక వనరుల నుండి వెలువడతాయన్నారు. ఇండోర్ వాయు కాలుష్య కారకాల బారిన పడడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుందన్నారు. ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ (ఐఏఆర్ సి) రాడాన్, పీఎం వంటి కొన్ని ఇండోర్ వాయు కాలుష్య కారకాలను మానవులకు క్యాన్సర్ కారకాలుగా వర్గీకరించిందన్నారు. అదేవిధంగా వంట చేయడం, వేడి చేయడం వంటి వాటి వల్ల వచ్చే పీఎం బారిన పడటం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, ఇతర శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం కూడా పెరుగుతుందన్నారు. రాడాన్, పీఎంతో పాటు, ఇతర ఇండోర్ వాయు కాలుష్య కారకాలు కూడా క్యాన్సర్ ప్రమాదంతో ముడిపడి ఉన్నాయన్నారు. ఉదాహరణకు, నిర్మాణ వస్తువులు, ఫర్నిచర్, ఇంటిని శుభ్రపరిచే ఉత్పత్తుల ద్వారా విడుదలయ్యే విఓసీ లు జంతువుల్లో క్యాన్సర్‌కు కారణమవుతాయని తేలిందన్నారు. అదేవిధంగా, ఇండోర్ గాలిలో ఉండే సెకండ్‌హ్యాండ్ పొగ బారిన పడటం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, ఇతర శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం పెరుగుతుందన్నారు.

ఇండోర్ గాలి నాణ్యత, క్యాన్సర్ ప్రమాదాల మధ్య సంబంధం ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, ఇండోర్ వాయు కాలుష్య కారకాల బారిన పడకుండా ఉండటానికి మనం తీసుకోగల చర్యలున్నాయన్నారు. ఇండోర్ గాలిని తాజా బహిరంగ గాలితో మార్పిడి చేసే వెంటిలేషన్ వ్యవస్థలను ఏర్పాటు చేయటం వల్ల కాలుష్య కారకాల స్థాయిలు తగ్గుతాయ న్నారు. రాడాన్, సెకండ్ హ్యాండ్ పొగ వంటి కాలుష్య వనరులను గుర్తించి ఎయిర్ ప్యూరిఫైయర్లు గాలి నుండి కాలుష్య కారకాలను తొలగించడంలో సహాయపడతాయన్నారు.

సిపిఐ కౌన్సిలింగ్ సమావేశంలో పగడాల

- నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మం, ఏప్రిల్ 15 (నేటినిజం ప్రతినిధి) : ఖమ్మం నగరం స్థానిక సంస్థపురం ప్రాంత బీసీ కాలనీలో డివిజన్ సిపిఐ శాఖా మహాసభ యాతం భూపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, ఖమ్మం పట్టణ సిపిఐ నాయకులు మాడుగుల నాగేశ్వరరావు, మల్ల కొండయ్య 22వ డివిజన్ కార్యదర్శి, కాట్ల నరసరావు, వన్ టౌన్ ఏరియా మహిళా సమాఖ్య అధ్యక్షులు నారపోగు నాగమణి, సీనియర్ నాయకులు హేమ రోశయ్య, శీలం నాగేశ్వరరావు, నూతన కార్యదర్శి, యాతం భూపాల్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా వెంపటి నాగేశ్వరరావు, మరో సహాయ కార్యదర్శిగా ఖాదర్ బాబా, 11మంది కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశం లో శ్రీనివాస్ రెడ్డి, పి.వీరయ్య, కోటయ్య, గాలం శ్రీను, డాక్టర్ రాము, తదితరులు పాల్గొన్నారు.

భూ భారతిని సమర్థవంతంగా క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లాలి.

-17 నుంచి 30 వరకు రైతులకు అవగాహన సదస్సులు .

-జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.

సంగారెడ్డి ఏప్రిల్ 15(నేటి నిజం ప్రతినిది)తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక భూ చట్టం" భూభారతి" ని సమర్థవంతంగా, క్షేత్ర స్థాయిలో మంగళవారం కలెక్టరేట్లో రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. తేదీ

అమలు చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు రెవెన్యూ అధికారులకు పిలుపునిచ్చారు. :16-04-2025 రోజు బుధవారం ,రెవెన్యూ అధికారులకు శిక్షణ , రైతులకు తేదీ : 17 నుంచి 30 వరకు మండలాలవారీగా అవగాహన సదస్సులు వుంటాయని అన్నారు . నూతన భూభారతి పోర్టల్ ను ఓపెన్ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ ... ప్రభుత్వ ప్రతిష్టాత్మక నూతన భూ చట్టం భూభారతిని సమర్థవంతంగా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని అధికారులు ఆదేశించారు. భూభారతి రైతుల సమస్యలు పరిష్కరించి, భూముల వివాదాలు లేకుండా జిల్లాను తీర్చిదిద్దా లని అన్నారు. రైతులు కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగకుండా ఉండేందుకు భూభారతిని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా,గ్రామ, మండల ,జిల్లా స్థాయిలో రైతులు ప్రజలు లేవనెత్తే సందేహాలకు అర్థమయ్యే భాషల్లోని సమాధానాలు చెప్పి , భూ సమస్యలకు పరిష్కారాలు చూపాలని, రెవెన్యూ అధికారులకు కలెక్టర్ సూచించారు. రైతులు ఈ అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేయాలనీ అన్నారు .

భూభారతి చట్టంపై రెండు మండలాల చొప్పున అవగాహన సదస్సులు : కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, ఏప్రిల్ 15 : భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. ఇవాళ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో భూభారతి చట్టం, జిల్లాలో ధాన్యం కొనుగోలు నిర్వహణ తీరుపై అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ భారతిలో.. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకుగాను ముందుగా భూముల సర్వే, మ్యాప్ తయారీ, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ, మొదలగునవి భూ భారతిలో కీలక అంశాలని వెల్లడించారు.

ఈ చట్టంపై ప్రతీ రోజు రెండు మండలాల చొప్పున ఉదయం, మధ్యాహ్నం సమయంలో 6 రోజుల్లో జిల్లాలో గల 12 మండలాల్లో అవగాహన సదస్సులను సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆయా సదస్సులలో ప్రజలకు ఈ చట్టంపై నిశితంగా అవగాహన కల్పించాలన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తీసుకొచ్చిన భూ భారతిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, వకీలు, రైతు సంఘాల నాయకులు, సభ్యులను కూడా ఈ సదస్సులో భాగస్వామ్యం చేయాలని, చట్టంలో ఉన్న ప్రాధాన్యత అంశాల వివరాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా కరపత్రంపై ముద్రించాలన్నారు.

ఆర్ఓఆర్ తప్పుల సవరణ, సెక్షన్-4, 5, 7 ల గురించి అలాగే ఏ సమస్యకి ఎలా అప్పీల్ చేసుకోవాలి అనే అంశం మీద క్షుణ్ణంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ సదస్సులో అవగాహన కల్పించాలన్నారు. అలాగే జిల్లాలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. మిగిలిన కొనుగోలు కేంద్రాలను కూడా త్వరితగతిన ప్రారంభించాలని, నిర్వాహకులు ప్రతీ రోజు కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించాలన్నారు. ఐకేపీ, పీఏసీఎస్ ల ఆధ్వర్యంలో ఏర్పాటైన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తైన వెంటనే ఓపీఎంఎస్ లో ఎప్పటికప్పుడు వివరాలను నమోదు చేయాలని, తద్వారా సకాలంలో రైతులకు డబ్బులు అందుతాయన్నారు.

అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కువ రోజుల వరకు కేంద్రంలోనే పెట్టుకోకుండా తేమ శాతం రాగానే కాంటా పూర్తిచేసి, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలన్నారు.

బీఆర్ఎస్ సభకు భారీగా తరలిరావాలి.. కార్యకర్తలు, ప్రజలకు పటోళ్ల కార్తీక్ రెడ్డి పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 15:: బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి భారీ ఎత్తున తరలిరావాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పటోళ్ల కార్తీక్ రెడ్డి సూచించారు. రావుల కోళ్ల నాగరాజు అధ్యక్షతన బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సభను బండ్లగూడలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి కార్తీక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నన్ని రోజులు ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉన్నారని పటోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ప్రజల సమస్యలను గాలికి వదిలేశారని ఆరోపించారు. మంచినీళ్లు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే ఆయన మాత్రం అదిగో ఇదిగో అంటూ దాటవేస్తున్నారు తప్ప సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. హిమాయత్ సాగర్ నుంచి మంచి నీళ్లు అందిస్తామని కోట్ల రూపాయలు వెచ్చించి మంచినీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ కలుషిత నీరే వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ పరిధిలో మంచినీళ్లు లేక ప్రజలు అల్లాడిపోతున్నారని అన్నారు. దీనిపై ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ స్పంది ంచి.. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



ఘనంగా ప్రపంచ కళా దినోత్సవ వేడుకలు

-కళ ఒక విశ్వ భాష, కళకు సరిహద్దులు ఉండవు - కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 15: కళ ఒక విశ్వ భాష అని, కళకు ప్రాంతం, దేశం అనే సరిహద్దులు ఉండవని ప్రముఖ కాలమిస్ట్, విశ్రాంత ప్రధానాచార్యులు కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ రోజు స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రాంగణంలో లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ నిర్వహించిన ప్రపంచ కళా దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతూ, కళలు మానసిక ప్రశాంతత కల్పించడం, ఒత్తిడిని తగ్గించడం, పౌర సమాజాన్ని జాగృత పర్చడం, జాతీయ సమైక్యతను సాధించడం, సంస్కృతిక వారసత్వాలను కాపాడడం లాంటి పలు ప్రధాన విధులను వివిధ కళారూపాలు నిర్వహిస్తున్నాయని అన్నారు. కళ్లకు కాణాచిగా కరీంనగరానికి పేరు ఉందని గుర్తు చేశారు. ఈ ప్రాంతం జానపద కళలకు పుట్టిళ్లలో విలసిల్లిన ప్రాంతమని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి చేతుల మీదుగా కరీంనగరానికే గర్వకారణమైన పలువురు కళాకారులను సముచితంగా సన్మానించారు. శాస్త్రీయ నృత్యకారిణి చొప్పరి జయశ్రీ, ఫోక్ ఆర్ట్స్ బాధ్యులు గుండ్ర కృపాదానం, శాస్త్రీయ సంగీత ఆచార్యులు-దర్శకులు కె బి శర్మ, డ్యాన్స్ ఇన్స్ట్రక్టర్ సంగెం రాధాకృష్ణ, నాటకరంగ నటులు మంచాల రమేశ్‌లను లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ అధ్యక్షులు కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎం మహెందర్, కోట సత్యం సముచితంగా సన్మానించారు. అనంతరం కళాకారులు చొప్పరి జయశ్రీ, గుండ్ర కృపాదానం మాట్లాడుతూ డిజిటల్ యుగంలో కళలకు ఆదరణ తగ్గడం విచారకరమని, మన పునాదులను మరిచి పోకుండా అన్ని తరాలు వివిధ కళలను పెంచి పోషించాలని కోరారు. ఆసక్తిగల యువత తమకు ఇష్టమైన కళను సాధన చేయుట ద్వారా మానసిక ప్రశాంతతను పొందుతూ చదువుల్లో ఏకాగ్రత కూడా పెంతుకోవచ్చని సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నగర పౌరులు, వందకు పైగా యువతీయువకులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమయిన విల్లా వెర్డే లగ్జరీ విల్లా ప్రాజెక్ట్

హైదరాబాద్, ఏప్రిల్ 15: హైటెక్ సిటీలోని గ్రీన్ హిల్స్ రోడ్‌పై సైబర్‌సిటీ డెవలపర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన విల్లా వెర్డే ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం ఆదివారం (ఏప్రిల్ 13, 2025) సాయంత్రం 7:00 గంటలకు వైభవంగా జరిగింది. లగ్జరీ జీవనానికి చిహ్నంగా నిలిచే ఈ ప్రాజెక్ట్ ఆరంభ వేడుకకు ప్రముఖులు, ఆహ్వానిత అతిథులతో పాటు కన్నమర్లు హాజరయ్యి వీక్షించారు.

13.4 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయబడిన ఈ ప్రాజెక్ట్‌లో 89 విలాసవంతమైన విల్లాలు ఉన్నాయి. 300 నుంచి 440 చదరపు గజాల విస్తీర్ణంతో, ప్రత్యేకమైన ఆర్కిటెక్చర్ డిజైన్‌తో రూపొందిన ఈ విల్లాల్లో, కనీసం మూడు కార్ పార్కింగ్‌లు, టెర్రస్ స్విమ్ స్పా, అంతర్గత ఎలివేటర్, బయోఫిలిక్ డిజైన్ వంటి అత్యాధునిక సౌకర్యాలతో ఆకట్టుకుంటున్నాయి.

ప్రారంభోత్సవ విశేషాలు

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విల్లా వెర్డే యొక్క వీడియో టూర్ మరియు స్కేల్ మోడల్ ఆవిష్కరించబడ్డాయి. సైబర్‌సిటీ గత 20 ఏళ్ల విజయవంతమైన ప్రయాణాన్ని ప్రతిబింబించే ఒక ప్రత్యేక వీడియో ప్రదర్శించబడింది. అలాగే, ది చార్‌కోల్ ప్రాజెక్ట్తో భాగస్వామ్యాన్ని అధికారికంగా ప్రకటించారు, ఇది విల్లా వెర్డేకు ఆధునిక ఇంటీరియర్ డిజైన్‌లను అందించనుంది. శ్రీమతి సుసానే ఖాన్ స్థాపించిన చార్‌కోల్ ప్రాజెక్ట్ సహకారంతో బెస్పోక్ డిజైనింగ్ ఇంటీరియర్ ప్యాకేజీలు అందుబాటులో ఉండనున్నాయి. ఆధునికత, సొగసు, లగ్జరీ కలబోతగా ఉండే డిజైన్లు ఖాతాదారులకు ప్రత్యేక అనుభూతిని కలిగించనున్నాయి

'ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చే వరకు డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు బహిష్కరణ'

నల్గొండ, ఏప్రిల్ 15: తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలకు గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం అందించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో అన్ని యూనివర్సిటీల పరిధిలో జరిగే పరీక్షలను యధావిధిగా బహిష్కరిస్తామని తెలంగాణ అఫ్లియేటెడ్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. గతేడాది దసరాకు ముందు నుంచి వివిధ దశల్లో ఆందోళన చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 2 నుంచి జరగాల్సిన డిగ్రీ కాలేజీ సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలను కళాశాలల యాజమాన్యాలు బహిష్కరించాయి.

అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాకపోవడంతో ఈ నెల 11 నుంచి జరగాల్సిన వివిధ డిగ్రీ సెమిస్టర్ థియరీ పరీక్షలను సైతం బహిష్కరించి ఆందోళన కొనసాగిస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసే వరకు ఎలాంటి పరీక్షలు నిర్వహించమని పేర్కొంటూ మంగళవారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ భాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అవ్వాల రవి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డిను వేర్వేరుగా కలిసి విన్నవించారు. ఈ నెల 16 వరకు జరిగే పరీక్షలను యూనివర్సిటీ వాయిదా వేయగా అదేబాటలో 17 నుంచి జరిగే పరీక్షలను సైతం బహిష్కరిస్తున్నామని ఇందుకు వర్సిటీ సహకరించి తమకు న్యాయం చేయాలని కోరారు.

విద్యా మండలి చైర్మన్‌కు వినతి పత్రం అందజేసిన వారిలో తెలంగాణ అఫిలియేటెడ్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, భువనగిరి జాగృతి విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ బి.సూర్యనారాయణ రెడ్డి, మహాత్మా గాంధీ యూనివర్సిటీ చాప్టర్ అధ్యక్షుడు, నల్లగొండలోని నీలగిరి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ మారం నాగేందర్ రెడ్డితో పాటు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రామకృష్ణ, నల్లగొండ సిద్ధార్థ డిగ్రీ అండ్ పీజీ కళాశాల అకాడమిక్ డైరెక్టర్ గుండెబోయిన జానయ్య యాదవ్, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వివిధ కళాశాల యాజమాన్యాలు పి.భాస్కర్‌రావు, హనుమంతు యాదవ్, ధనుం జయ్, డి.ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఏ ఎన్నికలు వచ్చినా వార్ వన్ సైడే.. వరంగల్ సభకు ప్రతి పల్లె నుంచి తరలివెళ్దాం : మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 15 : ఈ నెల 27వ తేదిన వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు ప్రతి పల్లె నుంచి తరలి వెళ్దామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశంలో మాట్లాడారు.

పల్లె పల్లెలో గులాబీ జెండా ఎగుర వేయాలని, వారం రోజుల్లో గ్రామాలు, పట్టణాలలో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసుకొని ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు.

పార్టీ ఇచ్చిన పిలుపును నూటికి నూరు శాతం విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 16 నెలలు అవుతున్నా అభివృద్ధి శూన్యమన్నారు. ఎక్కడ చూసినా కేసీఆర్ హయాంలో చేసిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయన్నారు.

ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చినా వార్ వన్ సైడే ఉందన్నారు. వరంగల్ సభకు బీఆర్ఎస్ అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల అంజనేయులు, కో కన్వీనర్లు జుబేర్, కృష్ణాగౌడ్, మాజీ ఎంపీపీ శేరి నారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్ టోల్ సిబ్బందిపై ప్రభుత్వ ఉద్యోగి దాడి

హైదరాబాద్, ఏప్రిల్ 15: హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ఓ ప్రభుత్వ ఉద్యోగి రెచ్చిపోయాడు. రాజేంద్రనగర్ ఓఆర్ఆర్ ఎగ్జిట్ 17 వద్ద టోల్ సిబ్బందిపై దాడి చేశాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.

టోల్ సిబ్బంది, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడ్‌బండ్‌కు చెందిన హుస్సేన్ సిద్దిక్ సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డుల్లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఇవాళ ఉదయం తన కుటుంబసభ్యులతో కలిసి ఔటర్ రింగ్ రోడ్డుపైకి వచ్చాడు. రాజేంద్ర నగర్ ఔటర్ రింగ్ రోడ్డు నెంబర్ 17 వద్ద ఎగ్జిట్ అవుతుండగా తన కారుకు టోల్ మినహాయింపు ఇవ్వాలని అడిగాడు. ఇందుకు టోల్ సిబ్బంది అంగీకరించలేదు. మీకు టోల్ మినహాయింపు ఉండదని.. కచ్చితంగా టోల్ ఫీ చెల్లించాలని డిమాండ్ చేశాడు. దీంతో సిబ్బందిని పట్టించుకోకుండా హుస్సేన్ సిద్దిక్ కారును పక్క నుంచి పోనిచ్చేందుకు ప్రయత్నించాడు.

అది గమనించిన టోల్ సిబ్బంది.. సిద్దిక్ కారును ఆపారు. దీంతో ఆగ్రహించిన సిద్దిక్ కుటుంబసభ్యులు టోల్ సిబ్బందిపై దాడికి దిగారు. అక్కడే ఉన్న ఇతర సిబ్బంది వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా.. వారిపై కూడా దాడి చేశారు. ఈ ఘటనలో టోల్ సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజేంద్ర నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. టోల్ గేట్ ఎగ్జిట్ వద్ద ఉన్న సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు.

కేసీఆర్ పాలన ఎప్పుడొస్తుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు : సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 15: వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాలకు బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్ద బావి మల్లారెడ్డి గార్డెన్‌లో మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం రామిడి రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రజతోత్సవ వేడుకలకు సంబంధించి బీఆర్ఎస్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

అనంతరం సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ పాలన మళ్లీ ఎప్పుడు వస్తుందని ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలోనే రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా ప్రజలపై పన్నుల భారం మాత్రం మోపుతున్నారని మండిపడ్డారు. హామీలు ఇవ్వకుండానే పథకాలను అమలు చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని అన్నారు. హామీలు ఇచ్చి నెరవేర్చని సీఎం రేవంత్ రెడ్డిని చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ ధమాల్ అని పడిపోయిందని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. రియల్ ఎస్టేట్‌పై ఆధారపడి బతుకుతున్న ఎంతోమంది యువత బతుకు బుగ్గి అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను కదలించినా, కూలీలను కదిలించినా, ఏ వ్యాపారిని తట్టినా కన్నీటి పర్యంతమవుతున్నారని తెలిపారు. కేసీఆర్ పాలనలో రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్రం ఏమైపోతుందో కూడా ముఖ్యమంత్రికి సోయి లేదని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి ప్రతిపక్షాలను తిట్టుడే రేవంత్ రెడ్డి పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు.

ఇప్పటికీ కేసీఆర్ పథకాలే ప్రజలకు గుర్తున్నాయి

రాష్ట్రంలో ఇప్పటికీ కేసీఆర్ పథకాలే ప్రజలకు గుర్తున్నాయని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంచి నీళ్లు వస్తుంటే కేసీఆర్ నీళ్లు అంటున్నారని ఆమె గుర్తు చేశారు. హరితహారం కార్యక్రమం అనగానే కేసీఆర్ నాటిన చెట్లు అంటున్నారన్నారు. పింఛన్లు వస్తున్నాయా అని అడిగితే కేసీఆర్ పైసలని గుర్తు చేయడం జరుగుతుందన్నారు. రైతు బంధు గురించి అడిగినా కేసీఆర్ పేరే గుర్తు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. కేసీఆర్ పేరు లేకుండా చేయాలని కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుకుంటే అది సాధ్యమయ్యే పని కాదన్నారు. ప్రజల గుండెలలో కేసీఆర్ సుస్థిరంగా ఉన్నారని తెలిపారు. కేసీఆర్ వెంట నడవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వాన్ని నబండవర్గాలు కోరుకుంటున్నాయని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను చూసి మళ్లీ కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కేసీఆర్ పాలనే కావాలంటున్నారని ఆమె తెలిపారు.

రజతోత్సవాలకు పోలీసుల ఆంక్షలు

ఈనెల 27న వరంగల్‌లో జరగనున్న రజతోత్సవానికి ప్రజలు వెళ్లకుండా పోలీసులు అనేక ఆంక్షలు పెడుతున్నారని సబితా ఇంద్రారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కువమంది గుమిగూడకూడదని షరతులు పెట్టడం ఏంటని ఆమె ప్రశ్నించారు. సభకు వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నం జరుగుతుందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యయుతంగా నిర్వహించుకుంటున్న సభకు పోలీసులు ఆంక్షలు పెట్టడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. వాహనాలను కూడా అడ్డుకునే కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యాన్ని నడిపించబోతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినా ఎదుర్కోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

రజతోత్సవాలకు కదలిరండి:

ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవాలకు ప్రతి పల్లె నుంచి, ప్రతి బస్తీ నుంచి ప్రజలు తరలిరావడానికి సిద్ధంగా ఉన్నారని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రతి గూడెంకి, ప్రతి బస్తీకి రజతోత్సవ పోస్టర్లు వెళ్లాలన్నారు. గోడలకు రజతోత్సవాల గురించి వాల్ రైటింగ్ రాయించాలన్నారు. ప్రతి బస్తీ నుంచి, ప్రతి పల్లె నుంచి బస్సులు కదలాలని సూచించారు. కేసీఆర్‌ను చూడటానికి భారీ సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారని అన్నారు.

శ్రీశైలంలో వైభవంగా వార్షిక కుంభోత్సవం..!

శ్రీశైలం, ఏప్రిల్ 15: శక్తిపీఠ క్షేత్రమైన శ్రీశైల క్షేత్రంలో భ్రమరాంబ అమ్మవారికి వార్షిక కుంభోత్సవ సాత్వికబలి వైభవంగా నిర్వహించారు. గ్రామదేవత అంకాలకమ్మకు మంగళవారం తెల్లవారు జామున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భ్రమరాంబాదేవికి నవావరణ, త్రిశతి, ఖడ్గమాల, అష్టోత్తర కుంకుమార్చన, పారాయణలు ఏకాంతంగా నిర్వహించినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ సాంప్రదాయంగా రజకుడిచే శ్రీ చక్రం వద్ద స్థలశుద్ధి చేసి ముగ్గులు వేయించి పూజలు చేశారు.

వందల కేజీల పసుపు కుంకుమలతో ఆలయ ఈవో దంపతులు అర్చక వేదపండితులచే శాంతి ప్రక్రియను పూర్తిచేశారు. అనంతరం సుమారు ఐదువేలకుపైగా గుమ్మడి కాయలతోపాటు ఐదువేల కొబ్బరికాయలు, లక్షకుపైగా నిమ్మకాయలు సహా స్థానిక వ్యాపార సంఘంవారు, ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన దాతలు అందించిన నిమ్మకాయలు గుమ్మడికాయలతో అమ్మవారి ఆలయ సింహ మండపం వద్ద సాత్వికబలి సమర్పించారు.

అనంతరం హరిహరరాయ గోపురం వద్ద కోటమ్మవారికి సైతం ప్రత్యేక పూజలు నిర్వహించి గుమ్మడి నిమ్మకాయలతో సాత్వికబలి నిర్వహించారు. ప్రతి ఏటా చైత్రమాసం పౌర్ణమి తర్వాత వచ్చే మంగళ, శుక్రవారం కుంభోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సారి బలి గడియలు మంగళవారం రావడంతో ఏర్పాట్లు పూర్తిచేసి అమ్మవారి నిజరూప దర్శనం భక్తులకు కల్పించారు.

అమ్మవారి అంతరాలయంతో పాటు సింహమండపం వద్ద టన్నులకొద్ది వండిన అన్నం పెసరపప్పుతో కుంభరాశులు పోసి పిండి దీపాన్ని వెలిగించిన తరువాత మల్లికార్జున స్వామివారికి ప్రదోషకాల పూజాభిషేకాలు, మహా మంగళహారతి, అనంతరం ఉత్సవ మూర్తులను వెండి పల్లకీపై ఊరేగింపుగా ఆలయ ప్రదక్షిణ చేశారు. అమ్మవారి ఉగ్రరూప కిరణాలు స్వామివారిపై సోకకుండా స్వామివారి లింగరూపానికి ఉల్లిపాయలు, జీలకర్ర, శొంఠి కలిపిన పెరుగన్నం, భక్షాలతో అలంకరించారు.

స్వామివారి ఆలయ ప్రవేశ ద్వారంలో విధులు నిర్వహిస్తున్న వారితో సాంప్రదాయం ప్రకారం.. రాత్రి ఆరు గంటలకు స్త్రీ వేషంలో అమ్మవారి ఆలయానికి చేరుకోగా ప్రధాన అర్చకులు ఆలయ ద్వారాలు తెరిచి అమ్మవారికి కుంభ హారతి ఇచ్చారు. సాయంకాల ప్రత్యేక పూజల అనంతరం పిండి వంటలతో అమ్మవారికి మహా నివేదన చేశారు. వేలాదిగా తరలి వచ్చిన స్థానిక భక్తులు స్వామి అమ్మవార్ల దర్శనం చేసుకున్న అనంతరం ఆలయ ద్వారాలు మూసివేశారు.

కుంభోత్సవంలో ఆలయ డిప్యూటీ ఈవో రమణమ్మ, ఏఈవో హరిదాస్, పీఆర్వో శ్రీనివాసరావు, శ్రీశైలప్రభ సంపాదకుడు అనీల్‌కుమార్, భద్రతా అధికారి అయ్యన్న, అధికారులు సిబ్బందితో పాటు స్థానిక వ్యాపార సంస్థలవారు, వేదపండితులు, అర్చకులు, దాతలు అమ్మవారికి ఉదయం సాయంత్రం రెండు విడతలుగా సాత్వికబలి సమర్పించారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

-దక్షిణ మధ్య రైల్వే అధికారులు

కారేపల్లి, ఏప్రిల్ 15 : ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ పరిధిలోని సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం దక్షిణ మధ్య రైల్వే అధికారులు గ్రామ సభ నిర్వహించారు.

డోర్నకల్ నుండి కొత్తగూడెం రైల్వే రెండో లైన్ పనులను పరిశీలించిన రైల్వేశాఖ డీఆర్ఓ రైతుల భూమి, ఇండ్లు కోల్పోయిన వారికి కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నష్ట పరిహారం అందజేయనున్నట్లు చెప్పారు. భూములు పోయిన రైతులకి, ఇల్లు కోల్పోయిన వారికి తగు న్యాయం చేస్తామని గ్రామ సభలో వారు హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, జిల్లా, మండల రెవెన్యూ అధికారులు, రైల్వే బోర్డు మెంబర్, జిల్లా ఆఫీసర్ రాజేశ్వర్, సింగరేణి మండల తాసీల్దార్ సంపత్ కుమార్, ఆర్పీ నరసింహారావు, రైల్వే ఏఈ శ్రీకాంత్ రెడ్డి, రైల్వే బోర్డు మెంబర్ తురక నారాయణ, రైతు నాయకులు తోగారు, శ్రీను, ముక్క వెంకటేశ్వర్లు, ముళ్ల యాకాంబరం, గుండెబోయిన కోటేశ్వరరావు, కుమ్మరి రాజు, ఎస్కే అమీర్ పాషా, ఆగోళ్ల హరి, సాంబ పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు అనుమతులు వెంటనే రద్దు చేయాలి: జేఏసీ నాయకులు

హైదరాబాద్, ఏప్రిల్ 15:ప్యారానగర్ డంపింగ్‌యార్డుకు ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేయాలని అన్నారం గ్రామస్తులు డిమాండ్ చేశారు. మంగళవారం గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో కొనసాగుతున్న రిలే నిరాహారదీక్ష 70వ రోజుకు చేరుకుంది. ఈదీక్షలో అనంతారం యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు. వీరికి రైతు జేఏసీ నాయకులు సంఘీభావంతెలిపారు. అలాగే నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో రిలే నిరాహారదీక్షలో రైతులు, మహిళలు పాల్గొన్నారు. ఈసందర్భంగా రైతు జేఏసీ నాయకులు మాట్లాడుతూ డంపింగ్‌యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)కు వ్యతిరేకంగా 70 రోజుల నుంచి రిలే నిరాహారదీక్షలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించక పోవడం అన్యాయమన్నారు. ఇక్కడి గ్రామాల ప్రజల బాధలు తెలుకుని సర్కారు డంపింగ్ యార్డుకు ఇచ్చిన అనుమతులను వెంటనే ఉపసంహరించుకోవాలి డిమాండ్ చేశారు.

మఫ్టీల్లో పోలీసులు.. చోరీల నివారణకు చర్యలు చేపడతాం : అడ్మిన్ ఎస్ఐ కోటేశ్వరరావు

హైదరాబాద్, ఏప్రిల్ 15: చిల్కానగర్ డివిజన్ బాలాజీ ఎంక్లేవ్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు.

బాలాజీ ఎంక్లేవ్ కాలనీ అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి అభ్యర్థన మేరకు కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, పోలీస్ సిబ్బంది, కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి కాలనీలో జరుగుతున్న సైకిళ్లు, పెట్రోల్ దొంగతనాలకు, మందుబాబుల ఆగడాలు, పార్కులలో గంజాయి సేవించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్న విషయంపై సమావేశం ఏర్పాటు చేశారు. పెట్రోలింగ్ ఏర్పాటు చేసి చోరీల నివారణకు కృషి చేయాలని ఈ సందర్భంగా వారు పోలీసులను కోరారు.

ఈ కార్యక్రమానికి హాజరైన ఉప్పల్ అడ్మిన్ ఎస్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. చోరీల నివారణకు కచ్చితంగా పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తామని, చోరీల నివారణకు అన్ని చర్యలు చేపడతామని తెలిపారు. అదే విధంగా గంజాయిని అరికట్టే విషయంలో పోలీసులు మఫ్టీలలో తిరుగుతూ ఉన్నారని, గంజాయి బ్యాచ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి : తుమ్మల వీరారెడ్డి

నల్గొండ, ఏప్రిల్ 15: : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేసి అర్హులైన వారికి పింఛన్లు, ఇండ్ల స్థలాలు, రైతు భరోసా, రుణమాఫీ చేయాలని సీపీఎం పార్టీ నల్లగొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. సమస్యల పరిష్కారం కోసం పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట పాదయాత్ర మంగళవారం ముగిసిన అనంతరం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నేటికి అమలుకు నోచుకోవడం లేదన్నారు. అయిటిపాముల లిస్ట్ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలన్నారు. భూ సమస్యలు పరిష్కరించి పేదలకు న్యాయం చేసి కబ్జాలో ఉన్న వాళ్లకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పెండింగ్ లో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించాలని తాసీల్దార్ గుగులోతు ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, వంటిపాక వెంకటేశ్వర్లు, కుమ్మల శంకర్, ఇటికాల సురేందర్, కట్ట బక్కయ్య, గుడుగుండ్ల రామకృష్ణ, చిలుముల రామస్వామి, మురారి మోహన్, గడగోజు రవీంద్రాచారి, జాల రమేశ్, ఉట్కూరి సుజాత, శ్రీను., జాల అంజనేయులు, చిలుకూల సైదులు, లక్ష్మయ్య, ముసుకు రవీందర్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడిని దర్శించుకున్న సంగీత దర్శకుడు కోటి

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 15 : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు సాలూరి కోటేశ్వర్ రావు (కోటి) దర్శించుకున్నారు. మంగళవారం స్వామి వారి కొండపైకి చేరుకున్న ఆయన స్వయంభూ లక్ష్మి నరసింహస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా కార్యనిర్వాహణాధికారి భాస్కరరావు స్వామి వారి ప్రసాదం అందజేశారు. స్వామివారి చరిత్ర, క్షేత్రానికి సంబందించి ఆల్బమ్ చేసేందుకు సంకల్పించినట్లుగా కోటి తెలిపారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వేలాదిగా తరలిరావాలి : మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నల్గొండ, ఏప్రిల్ 15: ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పిలుపునిచ్చారు. మంగళవారం నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండల కేంద్రంలోని సత్యసాయి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యమ పార్టీగా మొదలైన బీఆర్ఎస్ ప్రస్థానం రాజకీయ పార్టీగా ఎదిగి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఎనలేని కృషి చేసిందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కంచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఏడాదిన్నర రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నట్లు తెలిపారు. రజతోత్సవ సభ తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ప్రారంభంమవుతుందన్నారు.

కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలన్నీ బోగస్ అని తేలిపోయిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు భయపడి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదని ఎద్దేవా చేశారు. ఉద్యమ సమయంలో అందరి కష్టాలు తెలుసుకుని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఎప్పటికైనా తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష అని ప్రజలు నమ్ముతున్నారన్నారు. పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ తరాల బలరాములు, మాజీ వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి వడ్డె సైదిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ్మా, నాయకులు గుర్రం సైదులు, దాసకి సంజయ్, గుండగోని రాములు, పెద్ది బాలనర్సయ్య, నకిరేకంటి నర్సింహ్మా, మునుగోటి ఉత్తరయ్య, మంగదుర్ల వెంకన్న, నోముల వెంకటేశ్వర్లు, దేవరకొండ నరేశ్, చౌగోని జనార్దన్, అంతటి శ్రీను, గుండమల్ల పురుషోత్తం, బీరెల్లి ప్రసాద్, జిల్లా యాదయ్య, జానీ పాషా, బెల్లి సుధాకర్. రెడ్డిపల్లి మనోహర్, లింగస్వామి, పోతరాజు నగేశ్ పాల్గొన్నారు.

కొత్త టోల్ పాలసీ విధానంపై కీలక ప్రకటన చేసిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ..!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: కొత్త టోల్ పాలసీ విధానంపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. మోదీ ప్రభుత్వం తీసుకురాబోతున్న కొత్త టోల్‌తో ఇబ్బందులన్నీ తొలగిపోతాయన్నారు. కొత్తగా ప్రవేశపెట్టబోతున్న టోల్ విధానంలో శాటిలైట్ ట్రాకింగ్, వెహికిల్ నంబర్ ప్లేట్ గుర్తింపు తదితర సాంకేతికను సైతం ఉపయోగించనున్నట్లు ప్రకటించారు. దాంతో నేరుగా బ్యాంకు ఖాతా నుంచి టోల్ మొత్తం డెబిట్ అవుతుందని.. ఇక మాన్యువల్‌గా టోల్ వసూలు చేయాల్సిన అవసరం ఉండదన్నారు. ముంబయి దాదర్ ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

త్వరలోనే దేశవ్యాప్తంగా టోల్ బూత్‌లను తొలగిస్తామని పునరుద్ఘాటించారు. కేంద్ర ప్రభుత్వం కొత్త టోల్ విధానంపై పనిచేస్తోందని, ఇది త్వరలో అమలు చేయబడుతుందని ఆయన అన్నారు. ప్రస్తుతం వివరాలన్నీ ఇప్పుడే చెప్పలేనని.. మరో 15 రోజుల్లో కొత్త టోల్ పాలసీని ప్రకటించనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత టోల్ సిస్టమ్‌పై ఫిర్యాదులు ఉండవచ్చన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంబయి-గోవా హైవే నిర్మాణ పనులు జూన్ వరకు పూర్తవుతాయన్నారు.

ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్న హైవే ఇదని.. పనులు పూర్తయితే ప్రజలకు, కొంకణ్ వైపు వెళ్లేవారికి ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు. దేశ మౌలిక సదుపాయాల మాట్లాడుతూ రాబోయే రెండేళ్లలో భారత రోడ్లు మెరుగ్గా మారుతాయని గడ్కరీ పేర్కొన్నారు. దేశ అభివృద్ధిలో హైవేలు, రోడ్‌నెట్‌వర్క్ మెరుగవడం చాలా కీలకమని.. ఈ దిశగా ప్రభుత్వం వేగంగా పని చేస్తుందన్నారు. ముంబయి-గోవా మధ్య నిర్మిస్తున్న జాతీయ రహదారి ఈ రెండు ప్రదేశాల మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుందని తెలిపారు. కొంకణ్ ప్రాంతంలో అభివృద్ధి వేగానికి కొత్త ఊపునిస్తుందని.. చాలా కాలంగా అసంపూర్తిగా ఉన్న ఈ ప్రాజెక్టును పూర్తి చేయడంలో అనేక అడ్డంకులు ఎదురయ్యాయన్నారు.

జూన్ నాటికి రోడ్డు నిర్మాణ పనులు వందశాతం పూర్తి చేస్తామన్నారు. భూసేకరణ, కోర్టు కేసులు, పరిహారం సంబంధిత సమస్యలపై వివాదాల కారణంగా పనులు ఆలస్యమవుతున్నాయన్నారు. ప్రస్తుతం, వివాదాలన్నీ పరిష్కారమయ్యాయని.. పనులు ఊపందుకున్నాయన్నారు. దేశ మౌలిక సదుపాయాలలో ఉన్న సవాళ్లపై స్పందిన్నా.. ఢిల్లీ-జైపూర్, ముంబయి-గోవా వంటి హైవేలు ఇప్పటికీ రోడ్లు రహదారులశాఖకు 'బ్లాక్ స్పాట్స్'గా పేర్కొన్నారు. నిజాలు చెబితే ప్రజలు నమ్మకపోవచ్చునని వ్యాఖ్యానించారు.

ప్రజలు అనుకున్నదే నేను మాట్లాడాను : ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 15: కాంగ్రెస్ ప్రభుత్వ 16 నెలల పాలనపై ప్రజలు ఈసడించుకుంటున్నారని.. అదే విషయాన్ని నేను మాట్లాడితే మంత్రులు వక్రీకరిస్తూ మాట్లాడు తున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు.

తొగుటలో తాను చేసిన వ్యాఖ్యలపై ఆయన ఇవాళ వివరణ ఇచ్చారు. ఎక్కడికి వెళ్లినా హరిగోస పడుతున్నారని సామాన్య ప్రజలతోపాటు దేశ ప్రధాని సైతం కాంగ్రెస్ పాలనపై పెదవి విరుస్తున్నారని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అడవులపై కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్లు నడిపిస్తున్నారని పేర్కొన్నారని తెలిపారు.

కాంగ్రెస్ హయాంలో రియల్ ఎస్టేట్ కుంటుపడి పోయిందని, ఆపద వొస్తే నాలుగు గుంటలు అమ్ముకుందాం అనుకున్నా.. ఎవరూ కొనడం లేదన్నారు.. అనుకున్న పనులు కావడం లేవని, ప్రభుత్వం ఎప్పుడు పోతే అప్పుడు బాగుండు అని సామాన్య ప్రజలతోపాటు, పారిశ్రామిక వేత్తలు, రియల్టర్లు, రైతులు కోరుకుంటున్నారని తాను పేర్కొనడం జరిగిందన్నారు.

10 మంది ఎమ్మెల్యేలను గుంజుకున్నారు..

బీఆర్ఎస్ ప్రభుత్వం రావడానికి సబ్బండ వర్ణాలు సహకరించడానికి ముందుకు వస్తున్నరన్నారు.. మీ ఎమ్మెల్యేలను కొనాల్సిన అగత్యం మాకు పట్టలేదని, మీకు మీ ఎమ్మెల్యేల మీద నమ్మకం లేకనే మా బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలను గుంజుకున్నారని ఎమ్మెల్యే విమర్శించారు.. కేసీఆర్‌కు తానే కాదు బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా ఆత్మలుగానే ఉంటారని, గతంలో కేసీఆర్ ఆత్మగా ఉన్న పొంగులేటి.. నేడు మంత్రి అయ్యాడని ఆయన విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

మా మీద విమర్శలు పక్కన పెట్టి మీ పార్టీని మీరు సక్క బెట్టుకోవాలన్నారు.. మీ పార్టీ ఎమ్మెల్యేలైన ప్రేమ్ సాగర్, రాజగోపాల్ రెడ్డి ఏం మాట్లాడుతున్నారో ప్రజలు గమనిస్తున్నారన్నారు? మీరన్నట్లు నాతోపాటు మీ మంత్రులకు, ఎమ్మెల్యే లకు కూడా నార్కో అనాలసిస్ పరీక్షలు నిర్వహించాలని కోరారు.. కేసీఆర్ రుబాబుగా పరిపాలన చేశాడని, మీ లెక్క డైవర్షన్ పాలిటిక్స్ చేయలేదని ఆయన పేర్కొన్నారు.

పైసా నిధులు ఇవ్వలేదు..

ప్రజలకిచ్చిన హామీలు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. తాను ఎమ్మెల్యేగా గెలిచి ఏడాది గడిచినా పైసా నిధులు ఇవ్వలేదన్నారు. డిపాజిట్ కోల్పోయిన రాజకీయ నాయకుడితో కొబ్బరికాయలు కొట్టిస్తున్నారని, అధికారులు జీ హుజూర్ అంటున్నారని మరి వారిని అసెంబ్లీలో కూర్చో పెడితే సరిపోతుందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాకు నంస్కారం నేర్పించారని.. మంచి చేస్తే శభాష్ అంటామని, చెడు చేస్తే విమర్శిస్తామన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి దుబ్బాకకు సమీకృత హాస్టల్, స్కిల్ యూనివర్సిటీ మంజూరు చేస్తే కృతజ్ఞతలు తెలిపామన్నారు. తాను స్వయం కృషితో ఎదిగానని, పైరవీల కోసం, కాంట్రాక్టుల కోసం, కమిషన్ల కోసం రాజకీయాల్లోకి రాలేదన్నారు.. నా మీద విమర్శించే వారు ముందు మీ గతం ఏందో చెప్పాలన్నారు.. ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

యువ ఫిల్మ్ మేకర్స్ కోసం 'కీప్‌ఇట్‌షార్ట్' ఓటీటీ ప్లాట్‌ఫామ్ ప్రారంభం

హైదరాబాద్, ఏప్రిల్ 15: యువ ఫిల్మ్ మేకర్స్ ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా సినీ స్టోర్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో కీప్‌ఇట్‌షార్ట్ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా సినీస్టోర్ టెక్నాలజీస్ సీఈఓ నాగేందర్ పోలమరాజు మాట్లాడుతూ ఇది దేశంలోనే మొదటి ఫిల్మ్, యానిమేషన్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఓటీటీ ప్లాట్‌ఫామ్ అన్నారు. యువ ఫిల్మ్ మేకర్స్ కు ప్రారంభ వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఈ ప్లాట్‌ఫామ్ ప్రతిభను వెలికి తీసేందుకు, గుర్తింపు పొందేందుకు ఇతరులతో కలిసే అవకాశం పొందేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 1,500 పైగా ఫిల్మ్ ఇనిస్టిట్యూషన్స్, 1,200 యానిమేషన్ ఇన్స్టిట్యూట్లకు చెందిన ఐదు లక్షలపైగా ప్రస్తుత, పూర్వ విద్యార్థులు కలరన్నారు. ఈ ప్లాట్‌ఫామ్ ప్రారంభంలో వెయ్యి నుంచి పన్నెండు వందల షోరీల్స్ లేదా టీమ్ ఎంట్రీలు (ఒక్కో టీమ్‌లో కనీసం ఐదుగురు సభ్యులు) అందుకుంటుందని అంచనా ఉందన్నారు. దీని ద్వారా ఆరు వేలకు పైగా యువ ఫిల్మ్ మేకర్స్ పాల్గొననున్నారని అర్థం అవుతుందన్నారు.

ఈ కీప్‌ఇట్‌షార్ట్ వేదిక వినూత్న డిజిటల్ టూల్స్ అందుబాటులోకి తెచ్చి డేటా ఆధారిత నిర్ణయాల ద్వారా సినిమా తయారీ వ్యవస్థను ప్రజలందరికీ అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన ఈ ప్లాట్‌ఫామ్ దర్శకత్వం, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, కథా రచన, స్క్రీన్ రైటింగ్ రంగాల్లో సృజనాత్మకతకు ఒక వేదికను అందిస్తుంది తెలిపారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఫిల్మ్, యానిమేషన్ ఇన్స్టిట్యూట్లు, మీడియా గవర్నింగ్ బాడీలు ఈ ప్లాట్‌ఫామ్‌తో కలిసి పని చేయడానికి ఆసక్తి వ్యక్తం చేస్తున్నాయన్నారు. చాలా ప్రొడక్షన్ హౌసులు ఈ ప్లాట్‌ఫామ్‌పై ఆసక్తి చూపుతుండటం విశేషం అన్నారు. కొత్త కథలు, వినూత్న ఆలోచనలు వినిపించే విద్యార్థుల కోసం ఇప్పటికే స్కౌటింగ్ చేస్తున్నారన్నారు. వినోద రంగంలో కొత్త శైలితో కూడిన ప్రతిభను వెలికితీయడంలో కీలక పాత్ర పోషించనుందని పేర్కొన్నారు. యువ ఫిల్మ్ మేకర్స్ చేతుల్లోకి తిరిగి అధికారం పెట్టడానికి కీప్‌ఇట్‌షార్ట్ ను నిర్మించామన్నారు. ప్రతిభ ఉన్నవాళ్లు పైకి రావాలన్నారు. దీనికి పరిచయాలు ఉండాల్సిన అవసరం లేదన్నారు. చదువుకుంటున్నప్పుడే దర్శకత్వం, కథ రాయడం, ఎడిటింగ్, సౌండ్ లాంటి పనులు చేయడానికి కీప్‌ఇట్‌షార్ట్ ఒక మంచి వేదిక అన్నారు. వాళ్లు తీసే సినిమాలు ఇండస్ట్రీలో పెద్ద వాళ్లకి కూడా చేరుతాయన్నారు. విద్యార్థుల కష్టానికి తగిన గుర్తింపు రావాలన్నదే తమ లక్ష్యమన్నారు.

తిరుమలలో అపచారం.. ఆలయ పరిసరాల్లో 10 నిమిషాల పాటు ఎగిరిన డ్రోన్

తిరుపతి, ఏప్రిల్ 15: తిరుమలలో మరోసారి అపచారం జరిగింది. శ్రీవారి ఆలయంపై డ్రోన్ కెమెరా కలకలం సృష్టించింది.

దాదాపు 10 నిమిషాల పాటు ఆలయ పరిసరాల్లో డ్రోన్ కెమెరా చక్కర్లు కొట్టడం గమనించిన భక్తులు విజిలెన్స్ అధికారులు సమాచారం ఇచ్చారు. దీంతో డ్రోన్ ఎగరవేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

డ్రోన్ కెమెరా ఎగరవేసిన భక్తుడిని రాజస్థాన్‌కు చెందిన అన్షుమన్ తరేజా అనే యూట్యూబర్‌గా టీటీడీ విజిలెన్స్ సిబ్బంది గుర్తించారు. మంగళవారం సాయంత్రం శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న హరినామ సంకీర్తన మండపం వద్ద డ్రోన్ ఎగురవేశాడని టీటీడీ తెలిపింది. సమాచారం అందుకున్న వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని, డ్రోన్‌ను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించినట్లు పేర్కొంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, డ్రోన్ కెమెరాతో చిత్రీకరించిన దృశ్యాలను టీటీడీ విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. ఇవాళ ఉదయం నుంచి తిరుమలలో ఇలాగే అతను వీడియోలు తీస్తున్నట్లుగా గుర్తించారు.

రాబోయేది బీఆర్ఎస్ 3.0 వెర్షన్ : ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్, ఏప్రిల్ 15: నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ పార్టీలపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు 8+8= జీరో అయ్యిందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు పైసా ఇవ్వలేదని విమర్శించారు. పసుపు బోర్డుకు కూడా పైసా ఇవ్వలేదని ఆరోపించారు. ఎంపీ అరవింద్ ఇందూరు బిడ్డనే అయితే.. పసుపు బోర్డుకు చట్టబద్ధత తేవాలని డిమాండ్ చేశారు. అన్ని బోర్డులకు పార్లమెంట్ చట్టం చేస్తే.. పసుపు బోర్డ్ గెజిట్ ద్వారా ప్రకటించారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కూడబలుక్కొని దోచుకుంటున్నాయన్నారు.

60 లక్షల మంది ఉన్న పెద్ద కుటుంబం బీఆర్ఎస్ అన్నారు. పార్టీ ప్రారంభమైన ప్రతి ఉద్యమం లక్ష్యం చేరుకోవడం కష్టమన్నారు. అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కేసీఆర్‌ను ప్రశంసించారని గుర్తు చేశారు. ఉద్యమంలో అనేక సంక్లిష్టమైన పరిస్థితులను చూశానని.. కేసీఆర్ దీక్ష చేయొద్దని చాలామంది కన్నీళ్లు పెట్టుకున్నారన్నారు. కేసీఆర్ బక్క మనిషే అయినా.. మొండి మనిషి అన్నారు. అయితే తెలంగాణ జైత్రయాత్ర.. లేకుంటే కేసీఆర్ శవయాత్ర అని దీక్షకు బయలుదేరారన్నారు. కేసీఆర్ పిలుపునిస్తే ఊరూవాడలు కదిలాయన్నారు. స్వరాష్ట్ర ఉద్యమం ప్రతి సందర్భం స్ఫూర్తిదాయకమన్నారు. తెలంగాణ కోసం 36 పార్టీలను కేసీఆర్ ఒప్పించారని.. మాయావతిని ఒప్పించేందుకు కేసీఆర్ 50 సార్లు వెళ్లి కలిశారన్నారు. యూపీఏ ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందని తెలిపారు. మళ్లీ 30 ఏళ్లు అధికారంలోకి రారని కాంగ్రెస్ వాళ్లకు తెలుసని.. అందుకే ఇష్టం వచ్చినట్టు దోచుకుంటున్నారని ఆరోపించారు.

ప్రజలు ఒక అవకాశం ఇచ్చారని.. కాంగ్రెస్ వాళ్లు ప్రజలకు సేవ చేసేందుకు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కాంగ్రెస్ పాలనలో 20 పర్సెంట్ కమిషన్ అని ఢిల్లీలో చెప్పుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం గురించి అలా మాట్లాడుకుంటే బాధగా అనిపించిందన్నారు. 25 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రస్థానం.. తెలంగాణ ప్రజల పోరాట చరిత్ర.. అటుకులు తినైనా బతుకుతాం.. ఆత్మగౌరవం వదులుకోబోమని కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. తర్వాత వచ్చేది బీఆర్ఎస్ 3.ం వెర్షన్ అని.. కార్యకర్తలు చెప్పేదే బీఆర్ఎస్ చేస్తుందన్నారు. తెలంగాణ, నిజామాబాద్ అభివృద్ధి కోసం ఆనాడు బాజిరెడ్డి గోవర్ధన్ బీఆర్ఎస్ పార్టీలో చేరారన్నారు. పార్టీ కార్యకర్తలందరికీ అండగా ఉంటానని.. ప్రతి ఊరిలో గులాబీ జెండా ఎగురవేసి వరంగల్ సభకు బయలుదేరాలని కోరారు.

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కేసులు నమోదు : సీఐ వెంకటరాజగౌడ్

మెదక్, ఏప్రిల్ 14:రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కఠిన చర్యలు తీసుకోక తప్పదని రామాయంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట రాజగౌడ్ అన్నారు. ఇవాళ తన కార్యాలయంలో సీఐ విలేకరులతో మాట్లాడుతూ.. రోడ్లపై ధాన్యం ఆరబెట్టడంతో విలువైన ప్రాణాలకు కారణం రైతులే అవుతారని పేర్కొన్నారు.

ఇకపై ధాన్యం రోడ్లపై కనిపిస్తే ధాన్యాన్ని నేరుగా పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తామన్నారు. ధాన్యం ఆరబోసిన వ్యక్తులపై కేసులు కూడా నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ధాన్యం ఆరబోయడం వల్ల వాహనాలు పల్టీ కొట్టడంతో బైకర్లు, ఇతర వాహనదారులు మృతి చెందడం జరుగుతుందని అన్నారు.

తాగునీటి సరఫరాకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ : కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, ఏప్రిల్ 14:తాగునీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులను సత్వరమే పరిష్కరించాలని, ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు.

ఇవాళ కలెక్టరేట్ ప్రజావాణి హాల్‌లో వేసవిలో తాగునీటి సరఫరా, ఇందిరమ్మ గృహ నిర్మాణాల పురోగతి విషయాలపై అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీపీఓ యాదయ్య, డీఆర్‌ఓ భుజంగరావు, హౌసింగ్ పీడీ మాణిక్యం సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ కమిషనర్, స్పెషల్ ఆఫీసర్స్, ఎంపీడీవోలు, ఎంపీఓలతో కలెక్టర్ రాహుల్‌రాజ్ సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవికాలం పూర్తి చేసుకొని వర్షాలు వచ్చేవరకు తాగు నీటి సరఫరా అంశంపై అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రత్యేక సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించి తద్వారా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి జిల్లాలో రూపొందించుకున్న ప్రణాళిక, నీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలు, వాటిని పరిష్కరించేందుకు తీసుకుంటున్న చర్యలు, నీటి పునరుద్ధరణ వివరాలు తెలియజేయాలని అన్నారు.

వేసవి కాలంలో తాగునీటి సరఫరాకు సంబంధించి అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసి సన్నద్ధంగా ఉన్నామని అన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి క్షేత్రస్థాయి నుంచి రెగ్యులర్ ఫీడ్ బ్యాక్ తీసుకోవాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి తాగునీరు ఇబ్బందులు తొలగించి.. సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా సప్లిమెంట్ చేయాలని పేర్కొన్నారు.

ప్రతిరోజు పర్యవేక్షించాలి..

రానున్న రెండు నెలల పాటు క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను వెంటనే గుర్తించి వాటిని సత్వరం పరిష్కారం అయ్యే విధంగా చూడాలని, తాగునీటి సరఫరాను ప్రతిరోజు పర్యవేక్షించాలని. ప్రత్యామ్నాయ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు తాగు నీరు సరఫరా అవుతున్న హ్యాబిటేషన్స్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి రిపోర్టు అందించాలన్నారు.

అవసరమైన మేర సిబ్బందిని నియమించుకొని భూగర్భ జలాల నీటి స్థాయిని ఎప్పటికప్పుడు గమనిస్తూ జిల్లాలో అవసరమున్న వారికి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల ఎంపికలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలను ఎంపిక చేయాలని తెలిపారు.

ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండాలని సూచించారు. ప్రతీ గ్రామం నుండి లబ్ధిదారుల జాబితా తయారు చేయాలని అట్టి జాబితా ప్రకారం విచారణకు గెజిటెడ్ అధికారులను విచారణ అధికారులుగా నియమించనున్నట్లు తెలిపారు.

ప్రతీ గెజిటెడ్ అధికారికి 200 మంది లబ్ధిదారుల జాబితా ఇవ్వడం జరుగుతుందని, ప్రతి రోజు కనీసం 25 మంది లబ్ధిదారుల విచారణ చేపట్టి ఇట్టి ప్రక్రియను 8 రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.